ఈజీ బైక్.. ఈజీ రైడ్!
విశాఖలో ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న ఆదరణ -8లో

పెట్ మాల్స్
» అక్కడ దొరికేవన్నీ పెంపుడు జంతువులకే
» ప్రత్యేకత సంతరించుకున్న అప్పుఘర్ రోడ్

జల వనరులకు జవసత్వాలు

పోలవరం ఎడమ కాలువ పనుల పూర్తికి రూ.800 కోట్లు

- ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ప్రభుత్వం పెద్దపీట
- 2026 జూలైనాటికి పూర్తిచేయాలని లక్ష్యం
- పోలవరం, సుజల స్రవంతితో ఉత్తరాంధ్రలో నదులు అనుసంధానం
- సీఎం చంద్రబాబుకు కలెక్టర్ విజయకృష్ణన్ సమగ్ర నివేదిక



పోలవరం ఎడమ కాలువపై ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద అసంపూర్తిగా వున్న అక్విడక్టు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సాగునీటి వనరులు పునరుజ్జీవాన్ని పొందనున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిధులు విడుదల చేయకపోవడంతో అధ్వానంగా తయారైన సాగునీటి వనరులకు జవసత్వాలు కల్పించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో సాగునీటి వనరులకు మరమ్మతులు, పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టడానికి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికను కలెక్టర్ విజయకృష్ణన్, అమరావతిలో రెండు రోజులపాటు జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు.

గోదావరి జలాలను జిల్లాకు తరలించేందుకు చేపట్టిన పోలవరం ఎడమ కాలువ పనులు త్వరగా పూర్తి చేయడంతోపాటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులను వేగవంతం చేయనున్నారు. 2009లో పోలవరం ఎడమ కాలువ పనులకు అప్పటి ప్రభుత్వం రూ.2 వేల కోట్లు కేటాయించినప్పటికీ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల పనులు ముందుకు సాగలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఎడమ కాలువకు సంబంధించి పలు పనులు చేపట్టి పూర్తిచేసింది. మిగిలిన పనులు కొనసాగుతుండగా 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అంతవరకు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. ఐదేళ్లపాటు ఎక్కడ వేసిన గొంగడ అక్కడే అన్న చందంగా వుంది. ఈ నేపథ్యంలో ఏడు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సీఎం చంద్రబాబునాయుడు జూలైలో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఎస్.రాయవరం మండలం



అమరావతిలో కలెక్టర్ల సదస్సుకు హాజరైన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ (ఫైల్)

దార్లపూడి వద్ద అసంపూర్తిగా వున్న అక్విడక్టును పరిశీలించారు. దీని నిర్మాణ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతోపాటు కాలువలో మిగిలిన పనులకు ప్రభుత్వం రూ.800 కోట్లు మంజూరు చేయనున్నది. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను కూడా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. పోలవరం ఎడమ కాలువ, సుజల స్రవంతి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే ఉత్తరాంధ్రలో నదులను అనుసంధానం చేస్తారు. తద్వారా సాగు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

2026 జూలైనాటికి సుజల స్రవంతి....

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను ఏడాదిన్నరలో పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ చురుగ్గా సాగుతున్నది. వీలైనంత త్వరగా టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం వుంది. 2026 జూలైనాటికి ప్రాజెక్టును పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టు కుంది. సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తయితే పోలవరం ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువ ద్వారా ఏటా 63.2 టీఎంసీల నీరు ఈ ప్రాజెక్టుకు చేరుతుంది. తద్వారా సుమారు 8 లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందుతుంది.



దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువ

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

- జిల్లాలో 2,060 ప్రాదేశిక నియోజకవర్గాలు, 2,75,266 మంది ఓటర్లు
- 300 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ



చోడవరం నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఎన్నికల సిబ్బంది

అనకాపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):


జిల్లాలో సాగునీటి సంఘాలకు శుక్రవారం ఎన్నికలు జరగనున్నాయి. ఆయా కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారు. ఎన్నికల నోడల్ అధికారి, జలవనరుల శాఖ ఈఈ ఎ.త్రినాథం అందించిన వివరాల ప్రకారం జిల్లా లో ఏకైక మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు తాండవ. దీనికింద 27 సాగునీటి సంఘా లు, ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు వున్నా యి. వంద నుంచి ఐదు వేల ఎకరాల ఆయకట్టు కలిగిన చిన్నతరహా నీటి వనరులు 256 ఉన్నాయి. మధ్యతరహా ప్రాజెక్టులు రైవాడ, కోనాం, పెద్దేరు ఉన్నాయి. వీటి కింద 28 నీటి సంఘాలు వున్నాయి. ప్రతి సంఘానికి ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. అనంతరం వీరిలో నుంచి ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.

జిల్లాలో 2,060 ప్రాదేశిక నియోజకవర్గాలు, 2,75,266 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు 300 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో 1,876 మంది సిబ్బంది పాల్గొంటారు. చేతులు ఎత్తడం ద్వారా నీటి సం ఘాల డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఒకవేళ ఎన్నికలు నిర్వహించాలని ఎవరైనా కోరి తే.. బ్యాలట్ విధానంలో పోలింగ్ నిర్వ హించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్

మరో నెల రోజుల్లో అందుబాటులోకి సేవలు

- కిడ్నీ వ్యాధిగ్రస్థులకు ఊరట



ఎన్టీఆర్ వైద్యాలయంలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు సిద్ధం చేసిన వార్డు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కానుంది. సంక్రాంతి పండుగనాటికి కిడ్నీ వ్యాధిగ్రస్థులకు ఈ కేంద్రం అందుబాటులోకి వస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇందుకోసం వైద్యాలయంలోని కింది అంతస్తులో పది పడకలతో వార్డును సిద్ధం చేస్తున్నారు. చండీగఢ్ చెందిన రాహీ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు పార్టనర్‌షిప్) విధానంలో డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నది. ఈ యూనిట్ నిర్వాహణకు అవసరమైన వసతి కల్పించడం ప్రభుత్వ బాధ్యత. మిషనరీ, పరికరాలు, వైద్య సిబ్బందిని రాహీ కేర్ సంస్థ సమకూర్చుకోవడంతోపాటు డయాలసిస్ కేంద్రాన్ని నిర్వహిస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇది అందుబాటులోకి వస్తే అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ కోసం తరచూ విశాఖపట్నం వెళ్లేవారికి ఊరట కలుగుతుంది. ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, విశాఖ కేజీహెచ్‌లో మాత్రమే డయాలసిస్ యూనిట్లు ఉన్నాయి. ఎన్టీఆర్ ఆస్పత్రిలో డయాలసిస్ చార్జీలు వెయ్యి రూపాయల కన్నా తక్కువ వుంటాయని, ఈ సొమ్మును కూడా ప్రభుత్వమే భరిస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ఎన్టీఆర్ వైద్యాలయానికి ఎదురుగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ అందుబాటులోకి వస్తే అందులో కూడా ఐదు పడకలతో డయాలసిస్ యూనిట్ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. అనకాపల్లి మండలంలోని మొండుపాలెం, అచ్చియ్యపేట, మామిడిపాలెం పరిసర గ్రామాలతోపాటు చుట్టు పక్కల మండలాల్లో కిడ్నీ సంబంధ వ్యాధిగ్రస్తులు అధికంగానే వున్నారు. ఎన్టీఆర్ ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్ అందుబాటులోకి వస్తే విశాఖపట్నం వెళ్లాల్సిన అవసరం వుందని వైద్యులు చెబుతున్నారు.

మొండుపాలెంలో 16 మంది కిడ్నీ వ్యాధిగ్రస్థులు

అనకాపల్లి మండలం మొండుపాలెం గ్రామంలో కిడ్నీ సంబంధ వ్యాధి బారినపడి పలువురు మృత్యువాత పడ్డారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం మామిడిపాలెంలో వైద్యశిబిరం నిర్వహించి 164 మందికి వైద పరీక్షలు నిర్వహించగా వీరిలో 16 మంది కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్నట్టు గుర్తించారు. వీరికి ఎన్టీఆర్ వైద్యాలయంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు.

మరో నెల రోజుల్లో డయాలసిస్ సేవలు



ఎన్టీఆర్ వైద్యాలయంలో పీపీపీ విధానంలో డయాలసిస్ యూనిట్ మరో నెల రోజుల్లో అందుబాటులోకి వస్తుంది. దీనికి కోసం ఇప్పటికే ఒక వార్డును సిద్ధం చేశాం. అనకాపల్లి, చుట్టుపక్కల ప్రాంతాల్లో కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్న వారు డయాలసిస్ కోసం విశాఖ కేజీహెచ్‌కు వెళ్లాల్సిన అవసరం వుండదు.

డాక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్

వైసీపీ ఆందోళన



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న వైసీపీ నాయకులు

రైతు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైసీపీ నేతలు శుక్రవారం అనకాపల్లిలో ఆందోళన చేశారు. రింగురోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు, సుంకరమెట్ట జంక్షన్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జేసీ జాహ్నవికి వినతిపత్రం అందించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొన్నారు. -వార్త 8వ పేజీలో

కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు



కనకమహాలక్ష్మి అమ్మవారిని సారెతో ఊరేగిస్తున్న భక్తులు

మార్గశిర మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఎలమంచిలిలో కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపును భారీ ఎత్తున నిర్వహించారు. అమ్మవారిని పల్లకీలో ఆశీనులను చేసి పట్టణ వీధుల్లో ఊరేగించారు. మహిళలు ఇళ్ల వద్ద పిండివంటలు తయారు చేసుకుని అమ్మవారికి సారె సమర్పించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్మవరంలోని అమ్మవారి ఆలయం వద్ద ప్రారంభమైన సారె ఊరేగింపు పలు వీధుల మీదుగా సాగి.. తిరిగి ఆలయానికి చేరింది. - ఎలమంచిలి/ ఆంధ్రజ్యోతి

ఆకట్టుకున్న కిసాన్ మేళా



శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన నూతన చెరకు వంగడాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం 65వ కిసాన్ మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను, శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన నూతన చెరకు వంగడాలను పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు. - తుమ్మపాల/ఆంధ్రజ్యోతి

పేకాట డెన్‌పై పోలీసులు దాడి

27 మంది అరెస్టు, రూ.1.89 లక్షల నగదు స్వాధీనం

- 18 మొబైల్ ఫోన్లు, 12 బైక్‌లు సీజ్
- మూడు రోజుల నుంచి పేకాట శిబిరం నిర్వహణ
- పట్టించుకోని స్థానిక పోలీసులు
- ఎస్పీకి ఫిర్యాదుతో నేరుగా రంగంలోకి దిగిన స్పెషల్ బ్రాంచి పోలీసులు

-8లో

విధులకు హెచ్‌ఎం డుమ్మాపై విచారణ

బుచ్చెంపేట ఎంపీపీ స్కూల్‌కు డీఈవో, డిప్యూటీ డీఈవోలు

- టీచర్లు, ఆయాతోపాటు విద్యార్థులను విచారించిన అధికారులు
- హెచ్‌ఎం, ఇద్దరు ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బుచ్చెంపేట ప్రాథమిక పాఠశాలలో విచారణ జరుపుతున్న డీఈఓ, డిప్యూటీ డీఈఓ

రోలుగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని బుచ్చెంపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం ఆరు నెలల నుంచి విధులకు గైర్హాజరైన వ్యవహారంపై జిల్లా విద్యా శాఖాధికారి జి.అప్పారావు నాయుడు, డిప్యూటీ డీఈఓ పి.అప్పారావు శుక్రవారం పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. హెచ్‌ఎం విధులకు హాజరుకాకపోయినా చర్యలు తీసుకోవడంలో ఎంఈవో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నిర్ధారించారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు నాగభూషణంతోపాటు ఎంఈఓ-1 జాన్‌ప్రసాద్ ... మిగతా 8వ పేజీలో

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యమే కారణమని బాలిక తల్లిదండ్రుల ఆరోపణ

- మృతదేహంతో పాఠశాల ఎదుట బైఠాయింపు
- వారిరువురిపై చర్యలకు డిమాండ్
- విచారణ చేపడతామని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి ప్రకటన





రోదిస్తున్న బాలిక కుటుంబసభ్యులు, బంధువులు (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన విద్యార్థిని మురల సత్యవతి (ఫైల్ ఫొటో)

మాడుగుల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

మాడుగుల మండలం తాటిపర్తి గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని శుక్రవారం ఉదయం మృతిచెందింది. తన కుమార్తె మృతికి ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్‌ల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ మృతదేహంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల ఎదుట బైఠాయించారు. దీనికి సంబంధించి తల్లితండ్రులు పెంటన్నదొర, సన్యాసమ్మ, ఇతర కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లా పాడేరు మండలం అయినాడ పంచాయతీ చీమనాపల్లి గ్రామానికి చెందిన మురల సత్యవతి (14)...తాటిపర్తి ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. సత్యవతి నాలుగైదు రోజులుగా జ్వరం వస్తుండడంతో ఇంటికి వెళతానని హెచ్‌ఎం, వార్డెన్‌లను అడిగింది. అయితే పరీక్షలు పూర్తయ్యేంత వరకూ ఇంటికి పంపించబోమని చెప్పారు. సత్యవతి చిన్నాన్న గురువారం మాడుగుల సంతకు వచ్చారు.

సత్యవతికి ఆరోగ్యం బాగుండడం లేదని తెలియడంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. వారు వెంటనే వసతి గృహానికి చేరుకుని సత్యవతిని మొదట మాడుగులలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లి, ప్రథమ చికిత్స అనంతరం చోడవరం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సత్యవతి మృతిచెందింది. ఈ నేపథ్యంలో తమ కుమార్తె మరణానికి హెచ్‌ఎం, వార్డెన్‌ల నిర్లక్ష్య వైఖరే కారణమని ఆరోపిస్తూ మృతదేహంతో ఆమె తల్లిదండ్రులు తాటిపర్తి గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదుట ... మిగతా 8వ పేజీలో

గేదె పొడవడంతో వార్డు మెంబర్ మృతి

ఎస్.రాయవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్రివానిపాలెంలో సొంత గేదె పొడవడంతో పంచాయతీ వార్డు సభ్యురాలు టేకు రాజేశ్వరి(43) మృతిచెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. రాజేశ్వరి శుక్రవారం సాయంత్రం తన పొలంలో ఉన్న పశువుల పాక వద్దకు వెళ్లింది. గేదెను పలుపుతో కట్టివేస్తుండగా వెనుక నుంచి ఆమెను బలంగా కుమ్మింది. దంతో రాజేశ్వరి ... మిగతా 8వ పేజీలో



టేకు రాజేశ్వరి (ఫైల్ ఫొటో)

నీటి సంఘాలకు పూర్వ వైభవం

» మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న పప్పల చలపతిరావు

ఎలమంచిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు కూటమి ప్రభుత్వంతోనే పూర్వ వైభవం వస్తుందని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, రాష్ట్ర ఆర్డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసే వారంతా వాటి అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. గత ప్రభుత్వం సాగునీటి సంఘాలను, రైతు సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. కూటమి శ్రేణులంతా నీటి సంఘాల ఎన్నికల్లో సమిష్టిగా వ్యవహరించాలన్నారు. అనంతరం నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై కసరత్తు పూర్తి చేసి, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బొండా జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్, మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి రాజు, సీనియర్ నేతలు దాడి ముసిలినాయుడు, ఆడారి ఆదిమూర్తి, మొల్లేటి సత్యనారాయణ, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, బొద్దపు రమణ, ఆదిబాబు, పండూరి శ్రీను, నానేపల్లి సుబ్బయ్యనాయుడు, పతివాడ చిన్నయ్యనాయుడు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అవకతవకలపై విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

అచ్యుతాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మడుతూరులో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలపై అధికారులు శుక్రవారం విచారణ జరిపారు. ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్ భారీ స్థాయిలో అవకతవకలకు పాల్పడ్డారంటూ ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన కార్యదర్శి శ్రీవేణి ఇటీవల జరిగిన జనవాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం జిల్లా ఏపీడీ మణికుమార్, మండల ఇన్‌చార్జి ఏపీఓ జి. నానిబాబు, ఈవోపీఆర్డీ శ్రీరామ నాయుడు ఆధ్వర్యంలో విచారణ జరిపారు. ఈ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ దొంగమస్తర్లు వేసి అవకతవకలకు పాల్పడ్డారంటూ శ్రీవేణి ఆధారాలతో అధికారులకు వివరించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారం

» ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



ఇరువాడ జంక్షన్ వద్ద విద్యుత్ ఫీడర్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో మారుమూల గ్రామాలకు కూడా విద్యుత్ సరఫరాలో లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అచ్యుతాపురం-అనకాపల్లి ప్రధాన రోడ్డులో ఇరువాడ జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ఫీడర్‌ని శుక్రవారం ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడింపల్లి, ఇరువాడ, దొప్పెర్ల, దోసూరు, చిట్టిబోయినపాలెంల్లో విద్యుత్ లోఓల్టేజి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఏపీఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద వైసీపీ నేతల నిరసన

నక్కపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసే వైసీపీ అభ్యర్థులతో నీటి తీరువా కట్టించుకోకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ ఆరోపించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు, అభ్యర్థులు ఆందోళన చేశారు. వీఆర్వోలు నీటి తీరువా కట్టించుకునేలా చూడాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు.

సచివాలయ సిబ్బంది నల్ల బాడ్జీలతో నిరసన

పాయకరావుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విశాఖపట్నం జీవీఎంసీ కార్పొరేటర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని గ్రామ సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి సచివాలయ ఉద్యోగులపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తోటాడలో స్వచ్ఛ హీ సేవా

మునగపాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటాడలో శుక్రవారం స్వచ్ఛ హీ సేవా కార్యక్రమం నిర్వహించామని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. గ్రామంలోని అన్ని వీధుల్లో చెత్త, చెదారాలను తొలగించామన్నారు. కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయికి బానిసలైన ముగ్గురుపై కేసు

మునగపాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయికి బానిసలుగా మారిన ముగ్గురు వ్యక్తులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. కొంత మంది చట్టం కళ్లుగప్పి గంజాయి సేవిస్తున్నారన్నారు. మండలంలో నాగులాపల్లికి చెందిన ఒకరిపైన, మునగపాకకు చెందిన ఇద్దరిపైన కేసు నమోదు చేశామన్నారు. గంజాయికి సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా స్థానిక పోలీసులకుగాని, 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు గాని సమాచారం ఇవ్వాలన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

మునగపాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం జరగనున్నాయని ఇరిగేషన్ ఏఈఈ పి.వినయ్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఈవో, ఏఈవో, సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై సమావేశమై, వారికి అవగాహన కల్పించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఈవో, ఏఈవోతోపాటు ఇద్దరు పీవోలు, పీఏలు బాధ్యతలు నిర్వహిస్తారన్నారు. మండలంలో మడకపాలెంలో రాజుట్యాంక్, మెలిపాకలో చల్లమల్ల రెగ్యులేటర్ సిస్టమ్, గర్లాడ ఛానెల్ సిస్టమ్, కొమరాజు ఛానెల్ సిస్టమ్, తిమ్మరాజుపేటలో కృష్ణంరాజు ఛానెల్, నాగులాపల్లిలో నాగులాపల్లి ఛానెల్, మునగపాకలో అనకాపల్లి ఆవకాలువ, గణపర్తిలో రేలుగెడ్డ సిస్టమ్, వెంకటాపురంలో ఊర చెఱువు, చూచుకొండలో చచ్చర్ల గెడ్డ, వాడ్రాపల్లిలో చిన ఆవ నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఒక్కో సంఘం నుంచి ఆరుగురు టీసీ సభ్యులు ఎన్నికవుతారని, చేతులు పైకెత్తే విధానంలో జరుగుతుందన్నారు. 11 నీటి సంఘాల పరిధిలో సుమారు 11,381 మంది రైతు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఛైర్మన్, వైస్.ఛైర్మన్‌గా పోటీ చేసే అభ్యర్థులు భూమి శిస్తు చెల్లించి ఉండాలన్నారు. సిబ్బందికి ఎన్నికల మెటీరియల్‌ను అందజేశామన్నారు.



నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న నీటి సంఘాల ఎన్నికల సామగ్రి

పాయకరావుపేటలో..

మండలంలోని ఏడు మైనర్ సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందుకు సంబంధించి ఇరిగేషన్ ఏఈ జి.శ్రీరామూర్తి అందజేసిన వివరాలిలా ఉన్నాయి. భూమి చానెల్ ఎన్నికలు మండలంలోని నామవరం ప్రాథమిక పాఠశాలలోను, ముఠా చానెల్‌కు ఎస్.నర్సాపురం జడ్పీ హైస్కూల్‌లోను, మంగవరం చానెల్‌కు మంగవరంలోని జడ్పీ హైస్కూల్‌లోను, ఆవ చానెల్‌కు గోపాలపట్నంలోని ప్రాథమిక పాఠశాలలోను, మాసాహెబ్‌పేట చానెల్‌కు మాసాహెబ్‌పేట ప్రాథమిక పాఠశాలను, రాజవరం చానెల్‌కు రాజవరం ప్రాథమిక పాఠశాల, గ్రామ సచివాలయంల్లోను, కనుమల చానెల్‌కు పాల్తేరు ప్రాథమిక పాఠశాల, గ్రామ సచివాలయంల్లోను ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒక్కో సంఘానికి ఆరుగురు డైరెక్టర్ల పదవులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

నక్కపల్లిలో..

మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతోంది. ఆ తరువాత వెంటనే డైరెక్టర్ల ఎంపిక, అధ్యక్షుల ఎన్నిక జరుగుతుంది. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఎన్నికల మెటీరియల్ వచ్చింది. ఏకగ్రీవం కాకుంటే చేతులెత్తే పద్ధతిలోనూ, లేకుంటే బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తామని డీఈఈ జగదీశ్వరరావు చెప్పారు.

రాంబిల్లిలో..

మండలంలోని 13 సాగునీటి సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు జరగనున్నాయని రాంబిల్లి ఇరిగేషన్ ఏఈఈ శివాజీ శుక్రవారం తెలిపారు. దిమిలి చానల్‌కు దిమిలిలోను, బాబాకాన్ చానల్‌కు మామిడివాడలోను, తామరచర్ల చానల్‌కు దిమిలిలోను, కృష్ణమ్మ చానల్‌కు కొప్పుగొండుపాలెంలోను, కట్టుబోలు చానల్‌కు కట్టుబోలులోను, కొత్తలి, ఎలమంచిలి చానల్‌కు కొత్తూరులోను, కుమ్మరాపల్లి చానల్‌కు కుమ్మరాపల్లిలోను, తాటాకులపాలెం చానల్‌కు మురకాడలోను, ఏడుముళ్ల చానల్‌కు రజాలలోను, నాళీ చానల్‌కు కొత్తూరులోను, తేడటిదిబ్బ చానల్‌కు మర్రిపాలెంలోను, పంచదార్ల వెల్చూరు చానల్‌కు పంచదార్లలోను, ఓండూరు చానల్‌కు గోకివాడలోని ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుందన్నారు. అనంతరం ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లు ఎన్నిక జరుగుతుందన్నారు. ఎన్నికల అధికారులుగా ఈఓలు, ఏఈఓలను నియమించారన్నారు. మండల ఎన్నికల అధికారిగా తహసీల్దార్ శ్రీనివాసరావు వ్యవహరించనున్నారన్నారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలిలో నీటి సంఘాల ఎన్నికలను శనివారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నికల్లో 8,540 మంది రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని 11 సాగునీటి సంఘాలకు జరిగే ఈ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పట్టణంలోని తులసీనగర్ బాలికల హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుంచి ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నియమించినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

కనకమ్మ సారె ఊరేగింపునకు పోటెత్తిన భక్తజనం



సారె ఊరేగింపును ప్రారంభించిన ఉత్సవ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ, ప్రతినిధులు



పట్టణంలో సారెను ఊరేగిస్తున్న మహిళలు

ఎలమంచిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):ఎలమంచిలి పట్టణ వీధులన్నీ శుక్రవారం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లాయి. పట్టణం కనకమహాలక్ష్మి నామ స్మరణతో హోరెత్తింది. మార్గశిర మాసం రెండో శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపును వేలాది మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తమ ఇళ్ల వద్ద తయారు చేసిన పిండి వంటలతో సారెను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ధర్మవరంలోని కనకమ్మ ఆలయంలో తెల్లవారు నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఛైర్మన్ కొఠారు సాంబ సారె ఊరేగింపును ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త కుటుంబీకులు కొఠారు గోవింద్, కమిటీ ప్రతినిధులు కొఠారు కొండబాబు, రాము, సత్యనారాయణ తదితరుల భక్తుల సమక్షంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి వేలాదిగా తరలివచ్చిన మహిళలు అమ్మవారిని, సారెను ఊరేగించారు. అమ్మవారి నామస్మరణతో పట్టణం హోరెత్తింది. మహిళల కోలాటాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయం నుంచి కాకివానివీధి మీదుగా ప్రధాన రోడ్డులో అమ్మవారి సారె ఊరేగింపు నిరహించారు. కోలాటం భక్తులకు పి.తాతాజీ అనే భక్తుడు నూతన వస్త్రాలను పంపిణీ చేసారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యారంగ సమస్యలపై గళమెత్తిన విద్యార్థులు

» ఎలమంచిలిలో భారీ ర్యాలీ » ఘనంగా ఎస్ఎఫ్ఐ మూడో జిల్లా మహాసభలు



ఎలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు గళం విప్పారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయంటూ మండిపడ్డారు. పట్టణంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ 3వ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించారు. వేలాది సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ నుంచి పాత సినిమాహాలు జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సినిమాహాలు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటును విడుదల చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించడంలో జాప్యం చేసినట్లయితే భవిష్యత్తులో ఉద్యమానికి ఈ మహాసభ వేదికగా మారుతుందన్నారు. జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం విచారకరమన్నారు. ప్రసంగించిన విద్యార్థి నాయకులంతా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జి. గీతాకృష్ణ ఉపాధ్యక్షులు ఎం.బాలాజీ. మండల కార్యదర్శి వెంకట్, ప్రతినిధులు మణికంఠ, రవి, కృపా. ఆనంద్. శ్రీను. విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే నంబరు 1 భూములపై కుట్ర

» తహసీల్దార్‌కు పెదదొడ్డిగల్లు, సీతంపాలెం రైతుల వినతి



నక్కపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్, గ్రామస్థులు

నక్కపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదదొడ్డిగల్లు, సీతంపాలెం గ్రామాల్లో నిరుపేదలు తరతరాల నుంచి సాగుచేసుకుంటున్న సర్వే నంబరు-1లో వున్న 233 ఎకరాలు కాజేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని, అలా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు, రైతులు ఆవేదన వెలిబుచ్చారు. శుక్రవారం పెదదొడ్డిగల్లు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సర్పంచ్ గొర్లనాగ విజయలక్ష్మి ఆధ్వర్యంలో తహసీల్దార్ నర్సింహమూర్తికి రైతులు వినతిపత్రం అందజేశారు. కొంతమంది వ్యక్తులు ఈ భూములను కొట్టేయాలని కుట్రపన్నుతున్నారన్నారు. అనంతరం పోలవరం ఎడమ ప్రధాన కాలువ భూ సేకరణకు సంబంధించి భూములిచ్చిన నిర్వాసిత రైతులు తమ సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు.

రాంబిల్లిలో..

మండలంలోని వెల్చూరు పంచాయతీ విజయరామపురం అగ్రహారంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావుకు పలువురు రైతులు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ త్రిమూర్తులు, రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్ కిల్లాడ మంగయ్యమ్మ, గ్రామ నాయకులు కిల్లాడ చిన్న, పలువురు రైతులు పాల్గొన్నారు.

మునగపాకలో..

మండలంలోని నాగవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 70 అర్జీలు వచ్చాయని స్థానిక తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు తెలిపారు. అన్ని రకాల భూ సమస్యలు పరిష్కారం లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలం కొడవటిపూడి, కేవెంకటాపురం గ్రామాల్లో సర్పంచ్‌లు కోసూరి అప్పారావు, పైల శ్రీదేవి, మంగ ఇందిరాభవానీల అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సులో 80 అర్జీలు అందినట్టు తహసీల్దార్ తిరుమలబాబు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రకాష్ ఆర్ఐ, వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో శత శాతం ఫలితాలు సాధించాలి

» డిప్యూటీ డీఈవో అప్పారావు

కోటవురట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో శతశాతం ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే కృషి చేయాలని డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా టెన్త్ క్లాసు విద్యార్థులకు పలు ప్రశ్నలు వేయగా సంతృప్తిగా సమాధానాలిచ్చారు. ఎస్ఏ పరీక్షల నిర్వహణపై విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ చదువుల్లో వెనుకబడిన విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. బోధనపై ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు చేశారు. హైస్కూల్ హెచ్ఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్డీసీ చైర్మన్ ప్రగడను కలిసి ఆర్అండ్‌బీ అధికారులు

ఎలమంచిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావును శుక్రవారం రోడ్లు, భవనాల శాఖ డీఈఈ పి. రాధాకృష్ణతోపాటు జిల్లాలోని ఎలమంచిలి, పరవాడ, నక్కపల్లి, అచ్యుతాపురం ఏఈఈలు సత్యవేణి, లలిత, జ్ఞానేశ్వరరావు, ఎస్.పద్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. అచ్యుతాపురంలోని ప్రగడ నివాసగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత : మునిసిపల్ వైస్‌చైర్మన్

ఎలమంచిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సెయింట్ జూడ్స్ స్కూలు ఎదురుగా ఉన్న వాకింగ్ ట్రాక్ వద్ద పేరుకుపోయిన తుప్పలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, వైస్ చైర్మన్ నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, సచివాలయ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ ప్రసాదరాజు, వైస్ చైర్మన్ నాగేశ్వరరావు

36 పశువులకు గర్భకోశ పరీక్షలు

ఎలమంచిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 36 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, పెయ్యలకు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేసినట్టు ఎలమంచిలి పశు వైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్. సీహెచ్. ఎంఎం గంగాధర్ తెలిపారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖల సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్టు తెలిపారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఏవో డాక్టర్. బెహరా ప్రసాద్, ఏటికొప్పాక పశువైద్యాధికారి ఎస్.దేవరాజు, శస్త్ర చికిత్స నిపుణులు డా.బానుబాబు వైద్య చికిత్సలు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ఆందోళన

అచ్యుతాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ సీపీఎం శ్రేణులు శుక్రవారం అచ్యుతాపురం జంక్షన్‌లో ఆందోళన చేశాయి. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో వాగ్దానం చేసిన కూటమి సభ్యులు ఇప్పుడు సర్దుబాటు పేరుతో పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పాత మీటర్ల స్థానే స్మార్టు మీటర్ల పేరుతో కొత్త మీటర్లు పెడుతున్నారని, దీని వల్ల వినియోగదారులకు చాలా ఇబ్బందులున్నాయన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో కె. సోమునాయుడు, కర్రి అప్పారావు, చొప్పా రమణ, బి. గణేష్, డి.శంకర్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు ఇష్టపడి చదవాలి

» ఎంఈవోలు నరేశ్, వేమగిరి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవోలు నరేశ్, నూకరాజు

నక్కపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో జరగనున్న టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఎంఈవోలు కె.నరేశ్, వేమగిరి నూకరాజు సూచించారు. మండలంలోని పెదబోదిగల్లం జడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతీ విద్యార్థితో ఎంఈవోలు ముఖాముఖి మాట్లాడారు. వారి పఠనా సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. పరీక్షలు రాసేముందు టెన్షన్ పడకుండా ప్రశాంతంగా వుండాలని సూచించారు. ముఖ్యంగా చదువు ఎంత ముఖ్యమో, ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే అవసరమన్నారు. మధ్యాహ్న భోజన పథకం రికార్డులను తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న అదనపు తరగతులను ప్రతీ విద్యార్థి సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. అనంతరం హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, చిన్నారావు, శ్రీదేవి, రమేశ్ బాబులతో సమావేశమై సూచనలు చేశారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు : ఎమ్మెల్యే

అచ్యుతాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఎలమంచిలి నుంచి పది మంది హాకీ క్రీడాకారులు అంతర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా శుక్రవారం అచ్యుతాపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిగి పుష్పగుచ్చాన్నిచ్చారు. త్వరలో వీరంతా కేరళ రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ నియోజకవర్గం నుంచి ఒకేసారి పది మంది క్రీడాకారులు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కేరళలో జరిగే పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

'పౌష్టికాహారంతోనే ఆరోగ్యం'

అచ్యుతాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే మహిళలకు ఆరోగ్యం మెరుగుపడుతుందని విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ సీహెచ్ భాగ్యలక్ష్మి అన్నారు. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, ఏసియన్ పెయింట్స్ సంయుక్తంగా దుప్పితూరు, భోగాపురంలలో గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అవగాహన సదస్సుని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సుఖ ప్రసవంతోపాటు తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

పెద్దింటి అమ్మవారి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండకర్ల పంచాయతీ వాసుల ఆరాధ్య దైవమైన పెద్దింటమ్మ అమ్మవారి పండుగ వాల్ పోస్టర్‌ని శుక్రవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆవిష్కరించారు. ఈనె 18న అమ్మవారి పండుగను నిర్వహిస్తున్నారు. మండలంతోపాటు పక్క మండలాలైన మునగపాక, పరవాడ, రాంబిల్లిల్లో ప్రత్యేక వాహనాలపై ప్రచారం చేస్తున్నారు. అలాగే పండుగకు వచ్చి మొక్కులు తీర్చుకొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు నాగులాపల్లిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం

మునగపాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులాపల్లిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఈ నెల 14వ తేదీన జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులకు ఆలయ ప్రవేశం ఉంటుందన్నారు. భక్తులు తరలి వచ్చి విజయవంతం చేయాలని ఉత్సవ కమిటి పిలుపునిచ్చింది.

నేడు 10 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 10 గ్రామాల్లో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. రాంబిల్లి, వాడపాలెం, కొత్తపేట, గోవిందపాలెం, చినకలవలాపల్లి, పెదకలవలాపల్లి, కేజీపాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం, వైలోవ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

టీడీపీ సీనియర్ నేత అప్పలకొండ మృతి




అప్పలకొండ (ఫైల్)

ఎస్.రాయవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వసిద్ధి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత ఎం. అప్పలకొండ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న హోం మంత్రి అనిత ఫోన్లో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అప్పలకొండ మృతదేహం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, నాయకులు తుంపాల నాగేశ్వరరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, పడమట సతీష్, జి గోవిందరావు నివాళులర్పించారు.

అడ్డరోడ్డులో హనుమంతుని వ్రతం

ఎస్.రాయవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు జంక్షన్‌లో ఆంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం హనుమంతుని వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక మహిళలు స్వామివారికి తమలపాకులు, సిందూరంతో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు ప్రసాద వితరణ చేపట్టారు.



సీఎం చంద్రబాబునాయుడుతో కలెక్టర్లు విజయ్‌కృష్ణన్, దినేశ్‌కుమార్

సీఎంను కలిసిన అనకాపల్లి, అల్లూరి కలెక్టర్లు

అనకాపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు విజయ్‌కృష్ణన్, ఏఎస్.దినేశ్‌కుమార్ గురువారం రాత్రి కలిశారు. కలెక్టర్లు, ఎస్‌పీలతో సీఎం చంద్రబాబుతో విందు అనంతరం దంపతులైన అల్లూరి, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలనాపరంగా తమ అనుభవాలను సీఎంకు వివరించారు.

తాడిలో తాగునీటి పథకం ప్రారంభోత్సవం



తాగునీటి పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు తదితరులు

పరవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని 80వ వార్డు తాడి బీసీ కాలనీలో జీవీఎంసీ నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ వాసులు తాగునీటి కష్టాలు తీరినట్టేనని పేర్కొన్నారు. తాడి గ్రామం తరలింపు ప్రక్రియ కూడా తొందరల్లోనే చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమాభాస్కర్, మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, కూటమి నాయకులు కోమటి సూరిబాబు, గొల్లవిల్లి నాగరాజు, గొల్లవిల్లి అచ్చిబాబు, జి.శ్రీనివాసరావు, పి.కృష్ణ, కోరుకొండ పైడిరాజు, గనిరెడ్డి కనకరాజు, దానబోయిన నీలకంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి: సీఐ

▸▸ పురవీధుల్లో ద్విచక్ర వాహనాలపై అవగాహన ర్యాలీ



హెల్మెట్ ధరించి ర్యాలీగా వెళ్తున్న సీఐ స్వామినాయుడు, పోలీసులు

కశింకోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ అల్లు స్వామినాయుడు సూచించారు. కశింకోట గ్రామ పురవీధుల్లో శుక్రవారం హెల్మెట్ ధరించి వాహనాన్ని నడిపి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్లే అధిక శాతం ప్రమాదాలు సంభవించి మృతి చెందుతున్నారన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని చెప్పారు. అటువంటి హెల్మెట్ ధరించడం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సీఐ కోరారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు మనోజ్ కుమార్, లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని ధర్నా



పార్కు వద్ద ధర్నాలో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వేసిన ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించరాదని డిమాండ్ చేస్తూ స్థానిక గవరపాలెం పార్కు జంక్షన్ వద్ద శుక్రవారం పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరెంట్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం రైతు సంఘం నాయకుడు కాళ్ల తెలయ్యబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ప్రతి ఒక్కరికీ గతంలో కంటే కరెంట్ చార్జీలు అధికమవుతాయన్నారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించరాదని, ఇప్పటికే బిగించిన మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు కాకుండా వినియోగదారులపై వేస్తున్న అదనపు భారాలను రద్దు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, శివరామ్, రామకృష్ణ, పెంటకోట సూరిఅప్పారావు, పాదచారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు రగ్గుల పంపిణీ



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెం పరమేశ్వరిపార్కు జంక్షన్ వద్ద సినీ హీరో వెంకటేశ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ వెంకటేశ్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు పి.చందు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్ జన్మదిన కేకును కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేశారు. అనంతరం చందు మాట్లాడుతూ మాట్లాడే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే సూక్తిని నమ్మి హెల్పింగ్ హ్యాండ్స్ టీమ్‌ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఐదేళ్లుగా సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆర్థిక ఇబ్బందులతో ఉన్న అభిమానులకు ఆర్థికసాయం అందిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రోత్సాహకులు శ్రీకాకుళం రాజు, మాజీ కౌన్సిలర్ జగన్మోహనరావు, వెంకటేశ్ ఫ్యాన్స్ పట్టణ ప్రతినిధులు లాయర్ శ్రీను, గాజువాక రాజు, కె.నాగేశ్వరరావు, రోషన్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని ఆదుకోవడం అవసరం

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ... కిసాన్‌మేళాకు హాజరైన రైతులు, విద్యార్థులు, అతిథులు

తుమ్మపాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం జరిగిన 65వ కిసాన్‌మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలకు చేయూతనిస్తున్నట్టుగా వ్యవసాయరంగానికి కూడా ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వాలన్నారు. వ్యవసాయం భారంగా మారిపోవడంతో రైతులంతా ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి రైతులను ఆదుకోవాల్సి ఉందన్నారు. రైతులకు లాభసాటి వ్యవసాయం చేసేలా శాస్త్రవేత్తలు నూతన విధానాలను అధ్యయనం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ సబ్సిడీపై రైతులకు విత్తనాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా ఉత్తరాంధ్ర రైతులకు ఒంటికన్ను విత్తనాలను అభివృద్ధి చేసి అందించాలన్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో అనకాపల్లికి హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్‌ను మంజూరు చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం దాన్ని తరలించేసిందన్నారు. తొలుత పరిశోధనా స్థానంలోని చెరకు పంట, వ్యవసాయ యంత్ర పరికరాలు, కిసాన్‌మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు వి.శివనారాయణ అధ్యక్షతన జరిగిన కిసాన్‌మేళాలో రైతులు అడిగిన పలు ప్రశ్నలకు శాస్త్రవేత్తలు జవాబులు చెప్పారు. అలాగే క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నారు. అలాగే అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు మాట్లాడుతూ పరిశోధనా స్థానం సాధించిన ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ వీవీకే జగన్నాథరావు, డాక్టర్ బి.ఆదిలక్ష్మి, డాక్టర్ కేవీ రమణమూర్తి, డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కిసాన్‌మేళాలో ప్రదర్శనలో ఉంచిన యంత్రాలు... మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో మొక్కలు

ఆకట్టుకున్న వ్యవసాయ స్టాళ్లు



రిటైర్డు ఏడీఆర్ డాక్టర్ జమునను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, తదితరులు

తుమ్మపాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం జరిగిన 65వ కిసాన్‌మేళాలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధానంగా వ్యవసాయ యంత్ర పరికరాలు, వ్యవసాయ పనిముట్లు, పండించిన పంటలు తదితర స్టాల్స్ పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నాయకులు, అధికారులతో కలిసి స్టాల్స్‌ను సందర్శించారు. స్టాల్స్ ప్రతినిధుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు వ్యవసాయ కళాశాలల విద్యార్థులు స్టాల్స్‌ను ఆసక్తిగా తిలకించారు.

ఉత్తమ ప్రదర్శన కనబరిచిన స్టాల్స్‌కు బహుమతులను అందజేశారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు పుస్తకాలను వేదిక పై ఆవిష్కరించారు. అలాగే పలువురికి అవార్డులను అందజేశారు. ప్రధానంగా సైంటిఫికెంట్ కంట్రిబ్యూషన్ ఇన్ షుగర్ కేన్ రీసెర్చికు డాక్టర్ పమిడి జమున అవార్డును అందుకోగా, ఆమెను అతిథులంతా ఘనంగా సత్కరించారు. బెస్ట్ సాయిల్ సైంటిస్టుగా డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, హైయిస్ట్ షుగర్ రికవరీకి పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం, అనకాపల్లి జిల్లా చోడవరం షుగర్ ఫ్యాక్టరీలు అవార్డులను అందుకున్నాయి. అలాగే బెస్ట్ ఉమెన్ సైంటిస్టు డాక్టర్ ఎస్.అనూరాధ, బెస్ట్ మెరిటోరియస్ షుగర్ కేన్ సైంటిస్ట్ డాక్టర్ పి.శ్రీదేవి, ఫైనల్ ఇయర్ బీఎస్సీ విద్యార్థిని కె.సాయిసుప్రియ అవార్డులు అందుకున్నారు. బెస్ట్ ఫార్మర్ అవార్డును సబ్బవరం మండలానికి చెందిన మామిడి శంకరరావు, బెస్ట్ ఎక్సటెన్షన్ ఆఫీసర్ కనిశెట్టి వెంకట రామారావు, బెస్ట్ జర్నలిస్టు అవార్డును మాటూరి కొండలరావు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారికి అతిథులంతా కలిసి దుశ్శాలువాలు కప్పి జ్ఞాపికలను బహూకరించారు.

ముగిసిన జిల్లా స్థాయి విలువిద్య పోటీలు



రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పరవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి విలువిద్య పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 30 మందికిపైగా క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిలో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 23 నుంచి 25 వరకు రాజమండ్రిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక చేశామని విశాఖ జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. ఈ పోటీలకు కోచ్‌లుగా కె.గోవింద్, వి.శివకుమార్ వ్యవహరించగా, జిల్లా ఆర్చరీ సంఘం ఉపాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే..

ఇండియన్ రౌండ్‌కు లలితసాయి, మోహిత్‌సాయి, నాబ్య ప్రభాత్, పూర్వరాథోడ్, బి.వైష్ణవి, సాహితి, సాయిమనస్వీ, హర్షిత తదితరులు ఎంపికయ్యారు.

అలాగే కాంపౌండ్ రౌండ్‌కు హర్ష, సాహిత్, వియశస్వి, వి.ఆద్య, రికర్వ్ రౌండ్‌కు సాత్విక్, అరియానా, తన్మయి ఎంపికయ్యారు. స్టాండ్ బైలుగా అశోక్, తేజేశ్వర్, ప్రణీత, కీర్తి ఎంపికయ్యారు.

సదస్సులతో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం

▸▸ పరవాడ తహసీల్దార్ అంబేద్కర్



నాయుడుపాలెం సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ అంబేద్కర్

పరవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ ఎస్‌వీజిఅంబేద్కర్ తెలిపారు. మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. సమస్యలను దరఖాస్తు ద్వారా తెలియపరచాలన్నారు. దరఖస్తు చేసుకున్న వారికి 45 రోజుల్లోగా సవస్య పరిష్కారమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వివిధ సమస్యలపై దరఖాస్తులను అందజేశారు. సుమారు 60కి పైగా దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి, మాజీ ఎంపీటీసీలు కూండ్రపు సీతారామయ్య, కూండ్రపు శ్రీరామ్మూర్తి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చౌక దుకాణాలకు 143 దరఖాస్తులు

నర్సీపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం డివిజనల్ కేంద్రంలోని 51 చౌక ధరల దుకాణాలకు 143 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో ఖాళీలు ఏర్పడ్డ 37 చౌక దుకాణాలతో పాటు సర్దుబాటులో భాగంగా కొత్తగా ఏర్పాటు చేయనున్న 14 దుకాణాలు ఉన్నాయి. వీటి కోసం ఆర్డీవో వీవీ రమణ ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. డీలర్ల పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ప్రింటౌట్ కాపీని 13వ తేదీ సాయంత్రం 5 గంటలోగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. దీంతో సబ్ కలెక్టర్ కార్యాలయం దరఖాస్తుదారులతో కిటకిటలాడింది. ఈ నెల 26వ తేదీన రాత పరీక్ష, 27న మౌఖిక పరీక్షలు నిర్వహిస్తామని ఆర్డీవో తెలిపారు.

15న తాండవ నీరు నిలిపివేత

నాతవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలకు ఈ నెల 15న సాగునీరు నిలిపివేస్తున్నట్టు డీఈఈ అనురాధ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 19న తాండవ ఆయకట్టు రైతులకు కుడి, ఎడమ కాలువల ద్వారా 52 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేశామని చెప్పారు. డిసెంబరు 20వ తేదీ వరకు తాండవ నీరు ఖరీఫ్ పంటకు విడుదల చేయాల్సి ఉండగా ఆయకట్టు రైతులు ఇంకా అవసరం లేదని చెప్పడంతో ఐదు రోజులు ముందుగానే గేట్లు మూసి వేస్తున్నట్టు డీఈఈ తెలిపారు. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 369 అడుగులు ఉందన్నారు.

'జీవీఎంసీ కౌన్సిల్ సభ్యుల వ్యాఖ్యలు సరికాదు'

సబ్బవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కౌన్సిల్ సభ్యుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సబ్బవరంలోని పలు సచివాలయాల ఉద్యోగులు శుక్రవారం చెప్పారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ ఉన్నత విద్యార్హతలతో ప్రజలకు సేవ చేద్దాం అన్న సదుద్దేశంతో ప్రభుత్వ ఉద్యోగంలో చేరామన్నారు. అప్పటి నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ కరోనా, వరదలు వంటి విపత్కర సమయాల్లో ప్రజలకు ధైర్యంగా సేవలు అందిస్తున్నామన్నారు. అన్ని సర్వేలను సకాలంలో పూర్తి చేస్తున్నామన్నారు. అటువంటి మాపై కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అమానుషంగా, ఆత్మాభిమానం దెబ్బతినేలా మాట్లాడటం దారుణమన్నారు. వారి వ్యాఖ్యలను ఖండిస్తూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు.



సబ్బవరంలో నిరసన తెలుపుతున్న వివిధ గ్రామాల సచివాలయ ఉద్యోగులు

పోస్టాఫీసును తరలించొద్దు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గాంధీనగరంలోని పోస్టాఫీసును తరలించొద్దని ఆమ్‌ఆద్మీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం హెడ్ పోస్టాఫీస్‌లోని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ పోస్టాఫీస్ 50 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తూ కోట్లాది రూపాయల లావాదేవీలు చేస్తున్నదని వివరించారు. ఆర్డీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎక్కువ మంది చేస్తున్నారన్నారు. అందరికీ అందుబాటులో ఉన్న ఈ పోస్టాఫీస్‌ను హెడ్ పోస్టాఫీస్‌కు తరలిస్తే ప్రజలకు సేవలు దూరమయ్యే ప్రమాదం ఉందని, ఈ విషయంలో ఆలోచించాలని ఆయన కోరారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

అనకాపల్లి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో శుక్రవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హెల్ప్ ఏజ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హెల్ప్‌ఏజ్ ఇండియా స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ లంకపల్లి మృణాల్, స్టేట్ కో-ఆర్డినేటర్ అల్లు కృష్ణారావు వయో వృద్ధులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ లిటరసీ, వీలునామా, స్మార్ట్ ఫోన్ వాడకంపై వివరించారు. సైబర్ క్రైమ్ జరిగిన గంటలోనే 1930 కాల్ చేస్తే పోగొట్టుకున్న డబ్బు తిరిగి వస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గౌరీపతి, డాక్టర్ స్వామి పాల్గొన్నారు.

తాడి గ్రామం తరలింపునకు చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యేకు సీఐటీయూ నేత గనిశెట్టి విజ్ఞప్తి

పరవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించేందుకు చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తాడి బీసీ కాలనీకి విచ్చేసిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కలిసి తాడి గ్రామస్థులు కాలుష్యం కారణంగా పడుతున్న ఇబ్బందులు గురించి వివరించారు. తరచూ రోగాల బారిన పడుతున్నారని, గాలి, నీరు కూడా కలుషితమవుతున్నాయని తెలిపారు. గ్రామం తరలింపునకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని కోరగా, ఆరు నెలల్లోగా తరలిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

డి-పట్టా భూముల సమస్య పరిష్కరించాలని వినతి

సబ్బవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డి-పట్టా భూముల సమస్యలను పరిష్కరించాలని మండలంలోని బంగారమ్మపాలెం, ఎ.సిరసపల్లి గ్రామాల రైతులు శుక్రవారం ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ రైతులు ఇచ్చిన వినతులను పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గణపతి, ఎస్ఆర్‌వో జయలక్ష్మి, సర్వేయర్‌లు ఎల్.అప్పారావు, రాంబాబు, శ్రీను, వీఆర్వో నాగేశ్వరరావు, సర్పంచ్ దాడి లావణ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దొడ్డి ప్రకాశ్, నాయకులు దాడి కన్నంనాయుడు, ఉప సర్పంచ్ అంగటి సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

▸▸ ఓ వ్యక్తిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమ్మపాల గ్రామంలో శుక్రవారం ఒక వ్యక్తి నుంచి 20 మద్యం క్వార్టర్ సీసాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు. కూండ్రం గ్రామానికి చెందిన ఎం.మహాలక్ష్మినాయుడు తుమ్మపాలలో మద్యం కొనుగోలు చేసి స్వగ్రామం వెళ్తుండగా విలేజ్ విజిటింగ్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ శ్రీను, సిబ్బంది అనుమానం వచ్చి తనిఖీ చేయగా 20 మద్యం సీసాలు లభ్యమయ్యాయన్నారు. ఈ మేరకు సీసాలను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి

సబ్బవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెల్త్ సూపర్‌వైజర్ సిహెచ్.స్వర్ణలత కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో పి.పద్మజ అధ్యక్షతన సమగ్ర గ్రామీణాభివృద్ధిపై మండల స్థాయి అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో మాతాశిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. ఎంపీడీవో పద్మజ, సీడీపీవో లలితకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో అవగాహన సదస్సుల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. తల్లీబిడ్డల పోషణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.చైతన్య, ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు, ఏవో శివప్రసాద్ నారాయణరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

శంకరరావుకు ఉత్తమ రైతు అవార్డు



శంకరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

సబ్బవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారపాడు శివారు బలిజపాలెం గ్రామానికి చెందిన మామిడి శంకరరావుకు ఉత్తమ రైతు అవార్డు లభించింది. ఈ అవార్డును మల్ల పైడితల్లి మెమోరియల్ ప్రైజ్ పేరిట ప్రతీ ఏడాది అనకాపల్లి ప్రాంతీయ రైతు పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) అందిస్తున్నది. శుక్రవారం అనకాపల్లిలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. వ్యవసాయంలో నూతన పద్ధతులను అవలంబించడం, మిశ్రమ పంటల సాగు, ముఖ్యంగా వరి పంట సాగులో నూతన పద్ధతులు, యాంత్రీకరణ అవలంబించడం వల్ల ఉత్తమ రైతు అవార్డుకు మామిడి శంకరరావును ఎంపిక చేసినట్టు వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. ఉత్తమ రైతు అవార్డు గ్రహీత శంకరరావు మాట్లాడుతూ వ్యవసాయంపై ఇష్టంతో కొత్త వంగడాలను దూర ప్రాంతాల నుంచి తెప్పించి, ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా శంకరావును మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అభినందించారు.



పాలమామిడిలో సదస్సులో మాట్లాడుతున్న పీవో అభిషేక్



కొయ్యూరులో వినతులు స్వీకరిస్తున్న అధికారులు



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

» జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

జి.మాడుగుల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను గిరిజన రైతులు సద్వినియోగించుకోవాలని పాడేరు జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె అభిషేక్ గౌడ సూచించారు. మండలంలోని పాలమామిడి పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుల ద్వారా భూ సమస్యలు, మ్యుటేషన్లు, సరిహద్దుల సమస్యలు, భూ ఆక్రమణలు పరిష్కరించుకోవచ్చన్నారు. అలాగే మండల ప్రత్యేక అధికారులతో గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులు జనవరి 10వరకు నిర్వహిస్తునట్టు జేసీ స్పష్టం చేశారు. అనంతరం పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులో భూ సమస్యలను పూర్తిస్థాయి ఆధారాలతో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. రెవెన్యూ, ఐటీడీఏ కార్యాలయాలు చుట్టు తిరగాల్సిన అవసరం లేకుండానే ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే పరిష్కరించే వెసులు బాటు కల్పించే ఈ సదస్సులు కల్పిందని చెప్పారు. భూ సమస్యలు, ముటేషన్ ప్రక్రియ, ఈ పాస్ పుస్తకాల జారీ, ఇతర రెవెన్యూ సమస్యలను 45 రోజుల్లోగా పరిష్కారిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలప్రత్యేక అధికారి విద్యాసాగర్, తహసీల్దార్ లచ్చపాత్రుడు, డిప్యూటీ తాహసీల్దార్ పి.చంద్రశేఖరరావుపాల్గొన్నారు.

కొయ్యూరులో రెవెన్యూ సదస్సు

కొయ్యూరు: రెవెన్యూ సంబందిత భూ సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ కోరారు. శుక్రవారం రాజేంద్రపాలెంలో తహసీల్దారు ఎస్ఎల్‌వీ ప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్‌టీఈఎస్ పరిధి ప్రత్యేక విభాగం పర్యవేక్షణలో జనవరి 8వ తేదీ వరకు సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ తెలిపారు. అనంతరం 37 సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ కు సంబంధించిన సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీ స్వామి, ఆర్ఐ, అటవి, రెవెన్యూ సంబంధిత అధికారులతో పాటు సర్పంచ్ సింహాచలం, నాయకులు జి. సత్యనారాయణ, బఖీర్ ఖాన్, వరహాలబాబు, రామ్మూర్తి, మేడిబోయిన చిన్న పాల్గొన్నారు.

124 అర్జీలు

పెదబయలు: భూ సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ జి.రంగారావు అన్నారు. మండలంలోని గోమంగి పంచాయతీలో రెవెన్యూ స దస్సు నిర్వహించారు. మ్యుటేషన్లు, ఇతర రెవెన్యూ సమస్యలపై మొత్తం 124 ఫిర్యాదు స్వీకరించారు. ఈకార్యక్రమంలో రీ సర్వే డీటీ వెంకరమణ, ఆర్ఐ పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: ఇన్‌చార్జి అధికారి ముజీబ్ ఆధ్వర్యంలో మండలంలోని సాగర, వసబంధ, గసభ పంచాయతీ నోగిలిలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. భూ సమస్యలపై గిరిజన రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు. సాగర గసభ పంచాయతీల సర్పంచులు తౌడమ్మ, సునీత, ఆర్ఐ రాము, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు సత్వర పరిష్కారానికి చర్యలు: తహసీల్దార్

చింతపల్లి: భూమి సమస్యలపై గిరిజనుల నుంచి వచ్చిన అర్జీలను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానిక తహసీల్దార్ బి. రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొందిపాకలు, లంబసింగి పంచాయతీ పరిధిలో యర్రవరం, దిగువపాకలు, భీమనాపల్లి, అసరాడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నాలుగు గ్రామాల్లో వివిధ భూముల సమస్యలపై 67అర్జీలు వచ్చాయన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వివిధ సమస్యలపై ప్రజలు నేరుగా అర్జీ ఇచ్చి అవకాశం ఉందన్నారు. గిరిజనులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఉప తహసీల్దార్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళపాలెం, కొడిసింగి, ఎర్రచెరువులు, తూరుమామిడి, సంపంగిగొంది గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఈ సదస్సులకు 30 అర్జీలు రైతులు అందజేశారన్నారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాలసుందరంబాబు, డీటీ దుమ్మంతి సత్యనారాయణ, ఆర్ఐ మహాదేవ్, సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, టీడీపీ నాయులు మొట్టడం రామకృష్ణ పాల్గొన్నారు.

41 దరఖాస్తుల స్వీకరణ

ముంచంగిపుట్టు: భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు, రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని, డీడీ ఎల్.రజిని అన్నారు. మండలంలోని దార్రెల పంచాయతీ పెద్దపేట, పేటమాలిపుట్టు, దార్రెలలో జరిగిన రెవెన్యూ సదస్సు లో ఆమె పాల్గొన్నారు. భూ సమస్యలపై 41 దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలోని సర్పంచ్ పాండురంగస్వామి, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున్, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, డీటీ భూపతిపడాల్, వీఆర్వో శ్రీనివాస, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం



సభ్యత్వ నమోదులో నియోజకవర్గ పరిశీలకులు నారాయణ

పాడేరురూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు రాజమండ్రి నారాయణ అన్నారు. శుక్రవారం పాడేరు వచ్చిన ఆయన నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి బుద్ద జ్యోతికిరణ్ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీ కార్యకర్తకు సభ్యత్వం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, వైఎస్ఎంపీపీ గంగపూజారి శివకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి దప్పోడి వెంకటరమణ, శేఖర్ బాబు, మధు, వెంకి పాల్గొన్నారు.

కమిటీల శ్రద్ధతోనే బాల్య వివాహాల నియంత్రణ

చింతపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలు నియంత్రించేందుకు కమిటీ సభ్యులు సమర్థంగా పనిచేయాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మండల స్థాయి చైల్డ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను మండల, గ్రామ స్థాయి కమిటీ సభ్యులు ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలన్నారు. బాల్యవివాహాల వల్ల బాలికల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుందని, మాత, శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జీవీ రమణ, ఏటీడబ్ల్యూఓ జయనాగ లక్ష్మి, ఏసీడీపీవో రామలక్ష్మి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి: పీడీ

జి.మాడుగుల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్మన్ పథకం ద్వారా మం జూరైన గృహల నిర్మాణాలు వేగవంతంగా చేయాలని ఆ శాఖ పీడీ బాబు నాయక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని జి.మాడుగుల పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలను సందర్శించారు. లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ గొప్పఅవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంటఏఈ డి. ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో సచివాలయ ఉద్యోగి మృతి



వెల్ఫేర్ అసిస్టెంట్ మోహిని (ఫైల్‌ఫొటో)

ముంచంగిపుట్టు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూసిపుట్టు సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గెమ్మెల మోహిని (32) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను మూడురోజుల క్రితం విశాఖ కేజీహెచ్‌లో కుటుంబ సభ్యు లు చేర్పించారు. అయితే పరిస్థితి విషమంగా మారడంతో శుక్రవారం మృత్యు వాతపడ్డారు. మోహిని మృతిపై ఎంపీ డీవో శ్రీసాయిహర్షం, మండల సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్య క్షుడు సాయికుమార్, కార్యదర్శి మనోజ్ తదితరులు సంతాపం తెలిపారు..

ఏపీసీపీఎస్ఈఏ మండల కార్యవర్గం ఎంపిక

హుకుంపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీసీపీఎస్ఈఏ మండల కార్యవర్గం శుక్రవారం ఎంపిక చేసినట్టు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.లోహితాస్ తెలిపారు. మండల అధ్యక్షుడుగా సీహెచ్.యువరాజు, ప్రధాన కార్యదర్శిగా నైని రామన్న, ఉపాధ్యక్షుడుగా ములుగు వాసుదేవ్, అదనపు కార్యదర్శిగా జి.వెంకటరమణ, కోశాధికారిగా కె.రాము, అసోసియేట్ అధ్యక్షుడిగా అడపా రామ్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా వి.మన్మధనాయుడు, గౌరవ సలహాదారులుగా కె.ప్రసాద్, సభ్యులుగా ఎస్.నాగరాజు, సీహెచ్.చిన్నబాబులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాసాడ ఈశ్వరరావు, ఎస్.వెంకట్, కె.రమేశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

పాడేరురూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జీఎస్.ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్, జిల్లా ప్రధాన కేంద్రాలలో విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు చేపడతామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం,మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తామన్నారు.

రైల్వే గేటులో నిలిచిన వాహనాలు

డుంబ్రిగుడ, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిడి వద్ద రైల్వే గేటు మొరాయించడంతో శుక్రవారం అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. గేటుకు ఇరువైపులా కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. రైల్వే సిబ్బంది చేరుకుని మరమ్మతులు చేపట్టారు. ట్రాఫిక్‌అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరి

» డీఎల్‌పీవో పీఎస్.కుమార్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతన్న ఎంపీడీవో పూర్ణయ్య

పాడేరురూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీలు అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరని డీఎల్‌పీవో పీఎస్.కుమార్ అన్నారు. పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో సర్పంచులు, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులకు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై మండల కార్యాలయంలో అందిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమం ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది లక్ష్యాలు పేదరికం లేని, మెరుగైన జీవనోపాధుల గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం, పిల్లల స్నేహపూర్వక గ్రామం, నీటి సమృద్ధి కలిగిన గ్రామం, పరిశుభ్రమైన, హరిత గ్రామం, స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, భద్రత కలిగిన గ్రామం, సుపరిపాలన కలిగిన గ్రామం, మహిళా స్నేహపూర్వక పద్ధతులపై శిక్షణల అందించిన అంశాలను కృషి చేస్తే గిరిజన గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో (పీఆర్‌ఆర్‌డీ)ఆర్‌వీఎస్. రమేశ్, ఏవో ఎ.మహేశ్వరరావు, 26 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఉపాధి ఏపీవో వై.వెంకటరమణ, ఎంఈవో-2 సీహెచ్.సరస్వతీదేవి, సీడీపీవో పి.ఝాన్సీరాణి, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల సుస్థిర అభివృద్ధిపై శుక్రవారం రెండోవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో పూర్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించి 17 లక్ష్యాల్లో 9 అంశాలపై జిల్లా స్థాయిలో శిక్షణ పొందినటువంటి టీవోటీల చేత శిక్షణ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వరహాలమ్మ, పంచాయితీ విస్తరణ అధికారి నర్సింగరావు, ఎంఈవో పుష్పజోసెఫ్, ఇంజనీర్ శివరామయ్య, సర్పంచులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు కార్పొరేటర్ గోవిందరెడ్డి క్షమాపణ చెప్పాలి



పాడేరు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

పాడేరురూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరం దెబ్బతినేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన విశాఖపట్నం జీవీఎంసీ కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లకే నానిపాత్రుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉద్యోగులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం శుక్రవారం నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం గోవింద రెడ్డికి తగదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లకే సత్యనారాయణ, వి. చిన్ని, రంజిత్, నాగరాజు, మనోహర్, మాధవి, సూకరత్నం, శ్రీలేఖ పాల్గొన్నారు.

అనంతగిరి: కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి వ్యాఖ్యలపై మండల కేంద్రంలోని శుక్రవారం సచివాలయం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం స్థానిక ఎంపీడీవో ఏవీవీ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. విధి నిర్వహణలోని అకింతభావంతో పనిచేస్తున్న తమపై కార్పొరేటర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఈ సందర్భంగా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. గోవిందరెడ్డి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చింతపల్లి: కార్పొరేటర్ గోవింద్‌రెడ్డి సచివాలయం ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు తగదని ఉద్యోగుల సంఘం నాయకుడు శోభన్ అన్నారు. శుక్రవారం కార్పొరేటర్ వ్యాఖ్యలను ఖండిస్తూ సచివాలయం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీవాసరావుకి వినతి పత్రమందజేశారు.

హుకుంపేట: సచివాలయ ఉద్యోగులు వుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. గోవింద రెడ్డి చేసిన అనుచితవ్యాఖ్యలను వెనక్కితీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్

అనంతగిరి, డిసెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): తల్లిదండ్రుల ఆశలు నేరవేర్చే బాధ్యత విద్యార్థులపై ఉందని డీఎస్పీ వేణుగోపాల్ అన్నారు. ఎస్పీ అమిత్‌బర్ధర్ ఆదేశాల మేరకు.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత చదువులపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలోని అరకు సీఐ హిమగిరి, ఎస్ఐ డి. శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది, ప్రిన్సిపాల్ ప్రమీల పాల్గొన్నారు.

సలహా మండలి సమావేశానికి ఆర్ఈఏసీ సభ్యుడికి ఆహ్వానం

గూడెంకొత్తవీధి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో జనవరి 8,9 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి 54వ పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశానికి హాజరుకావాలని విశ్వవిద్యాలయం ఆర్ఈఏసీ సభ్యుడు వండల బాలయ్యకు ఆహ్వానం అందించినట్టు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి. బాలహుస్సేన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదనరావు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు




మరమ్మతు పనులు చేపడుతున్న డి.సంపంగిపుట్టు గిరిజనులు

హుకుంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని దుర్గం పంచాయతీ డి.సంపంగిపుట్టు పీవీటీజీ గిరిజనులు శ్రమదానంతో మట్టి రోడ్డుకు మరమ్మతులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు అధ్వానంగా మారడంతో బీటీ రోడ్డు మంజూరు చేయాలని అధికారులు, పాలకులకు పలుమార్లు వినతులిచ్చినా ఫలితం లేక పోయిందని గ్రామస్తులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తంచేశారు. రహదారి సౌకర్యం లేక పీఎంజన్ మాన్ గృహాల నిర్మాణ సామగ్రి తరలించ లేకపోతున్నామన్నారు. అత్యవసర సమయాల్లో డోలీల్లో గర్భిణులు, రోగులను ఆస్పత్రులకు తరలించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇకనైనా సంపంగిపుట్టు, రణంకోట పీవీటీజీ గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని కొర్రా కేశవరావుతో పాటు గ్రామ ప్రజలు కోరారు.

తొలి సంధ్య వేళలో..

» వంజంగి హిల్స్‌లో ప్రకృతి దృశ్యాల కనువిందు



వంజంగి హిల్స్‌లో సూర్యోదయం

పాడేరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ప్రకృతి అందాలు మైమరిపిస్తున్నాయి. చలికాలంకావడంతో కొండకోనలు మంచుదుప్పటి కప్పుకుంటున్నాయి. సూర్యోదయం వేళ తెలి మంచును చీల్చుకుని భానుడు రావడం అబ్బురపరుస్తోంది. మండలంలోని వంజంగి హిల్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఆకాశం నీలం, , పసుపు, ఎరుపు వర్ణాల్లో దృశ్యాలు పర్యాటకులను పరవశులను చేశాయి. గతంలో కేవలం వీకెండ్ పేరిట శని, ఆదివారాలు మాత్రమే పర్యాటకులు వంజంగి హిల్స్ సందర్శనకు విచ్చేవారు. కానీ ఈ ఏడాది రోజూ వంజం విచ్చేస్తున్నారు. హిల్స్‌లో సూర్యోదయ వేళ సుందరదృశ్యాలు ప్రకృతి ప్రియుల్నివిశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

సీఎంతో అల్లూరి, అనకాపల్లి కలెక్టర్లు



చంద్రబాబునాయుడుతో కలెక్టర్లు దినేశ్‌కుమార్, విజయ్‌కృష్ణన్

పాడేరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అల్లూరి సీతా రామరాజు, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు ఏఎస్.దినేశ్‌కుమార్, విజయ్‌కృష్ణన్ గురువారం రాత్రి కలిశారు. కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం చంద్రబాబుతో విందు అనంతరం ఇటీవలదంపతులైన అల్లూరి, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పాలనాపరంగా తమ అనుభవాలను వివరించారు.

పోలీస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి :డీఎస్పీ



విజేతలతో డీఎస్పీ ప్రమోద్, సీఐ సన్యాసినాయుడు

జి.మాడుగుల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మన్యంలో పోలీస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు డీఎస్పీ కె.ప్రమోద్ అన్నారు. మండలంలోని మారుమూల బొయితిలి పంచాయతీలో మెగా వైద్యశిబిరం, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్య క్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్య శిబిరంలో 278 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో 35 క్రీడ జట్లు పాల్గొనగా, చింతగొప్పు మొదటి స్థానం, ద్వితీయ స్థానం మడతకొండ, బొయితిలి తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు షీల్డుతో పాటు ఏకరూప దుస్తులు, కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ అప్పలరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగుల సమస్యలపై ధర్నా



ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొయ్యూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులు వారి సమస్యలపై ఆందోళన కొనసాగిస్తుండడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని, ఈ నేపథ్యంలో వారి సమస్యలు తక్షణం పర్కిరించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు పాంగి జీవన్ డిమాండ్ చేశారు. గత 28 రోజులుగా గురుకుల పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడిందని ఆవేదని వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులతో కలసి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంపై ఎస్ఎఫ్ఐ నేతలు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ గత 15 ఏళ్లగా సర్వీసులో ఉన్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను సీఆర్‌టీలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సూరిబాబు, ఆదివాసీ గిరిజన సంఘ అధ్యక్షుడు కృష్ణ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సూరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు మరింత రక్షణ



హెచ్‌ఎం, వార్డెన్లతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీడీ రజిని

అనంతగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థినులకు మరింత రక్షణ కల్పించాలని గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ ఎల్.రజిని అన్నారు. స్థానిక ఆశ్రమ బాలికల-2 పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.. ముందుగా పరిసరాలను పరిశీలించి, తగు సూచనలు చేశారు. స్టాక్‌రూమ్, డైనింగ్‌హాల్, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఉదయం వామ్మరైస్, ఉడికించిన గుడ్ల పరిశీలించి, మెనూ ప్రకారం ఉండడంతో సంతృప్తివ్యక్తం చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించి, కొన్ని సంకేతిక సమస్యతో పనిచేయకపోవడంతో గుర్తించారు. అనంతరం డీడీ రజిని మాట్లాడుతూ.. విద్యార్థినులు అనారోగ్యానికి గురైతే వెనువెంటనే ఆస్పత్రికి తరలించి, వైద్యసేవలందించాలని ఆదేశించారు.పాఠశాలల్లో నెలకొన్న ప్రహరీ, తాగునీటి రన్నింగ్ వాటర్, మరుగుదొడ్ల సమస్యపై ఉన్నతాధికారులకు నివేదికను ఇస్తామని తెలిపారు.

శిశువు మృతిపై ఐసీడీఎస్ అధికారులు విచారణ



మృతురాలి తల్లితో మాట్లాడుతున్న సీడీపీవో జీవీ రమణ

చింతపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపల్లి గ్రామంలో మూడు నెలల శిశువు మృతిపై ఐసీడీఎస్ అధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలకు స్పందించిన ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ స్థానిక సర్పంచ్ సోమరత్నంతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. చిన్నారి మృతిపై సీడీపీవో తల్లి వంజరి ఈశ్వరి, తండ్రి గణపతి, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీడీపీవో విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలల శిశువు పంప్రదాయ వైద్యంతో మృతి చెందినట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్ గౌహర్ ఉన్నీషా బేగం పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పీవో సందర్శన

పాడేరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఏజెన్సీలోని వివిధ ఆశ్రమ పాఠశాలల్లో సీసీటీవీ కెమెరాలకు అనుసందానించిన లైవ్ ఫుటేజ్‌లను ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో జరుగుతున్న స్టడీ అవర్ ప్రక్రియను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించాలని గిరిజన సంక్షేమ విద్యాశాఖాధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఎల్.రజనీ ఉన్నారు.

17న అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం

పాడేరురూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాడేరులో ఈ నెల 17వ తేదీన నిర్వహించే అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల దినాన్ని విజయవంతం చేయాలని విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఆరోజు ఉదయం 10 గంటలకు జిల్లాలోని విశ్రాంతి ఉ ద్యోగులు హాజరు కావాలని కోరారు.



రామన్నపాలెంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈఈ ఈశ్వరరావు

రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించండి

» పంచాయతీరాజ్ శాఖ డీఈఈ ఈశ్వరరావు

మాకవరపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న సిమెంట్ రహదారుల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ ఈశ్వరరావు ఆదేశించారు. మండలంలోని రామన్నపాలెం, జడ్.గంగవరం, శెట్టిపాలెం, దుంగలవానిపాలెం, వజ్రగడ, జి.గంగవరం గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ రోడ్లు, సీసీ డ్రైన్లతో పాటు పాఠశాల ప్రహరీ గోడల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సంక్రాంతి పండగ సమయానికి 80 శాతం పనులు పూర్తవుతాయని ఆయన పేర్కొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి: సీఐ

కశింకోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ అల్లు స్వామినాయుడు సూచించారు. కశింకోట గ్రామ పురవీధుల్లో శుక్రవారం హెల్మెట్ ధరించి వాహనాన్ని నడిపి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్లే అధిక శాతం ప్రమాదాలు సంభవించి మృతి చెందుతున్నారన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని చెప్పారు. అటువంటి హెల్మెట్ ధరించడం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సీఐ కోరారు.

పాఠశాలలో స్వీపర్ తొలగింపుపై విచారణ

గొలుగొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాథమిక పాఠశాలలో స్వీపర్ తొలగించడంపై మండల విద్యా శాఖాధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. స్వీపర్‌గా పనిచేస్తున్న మురుకుర్తి సుజాత పనితీరు సంతృప్తికరంగా లేదని గత నెల 1వ తేదీన కమిటీ సభ్యులు స్పందనలో కలెక్టర్‌కు అందించిన ఫిర్యాదు మేరకు తొలగించారు. అయితే స్వీపర్ సుజాత వారంరోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గొలుగొండ ఇన్‌చార్జి ఎంఈవోలు మూర్తి, సత్యనారాయణ, హెచ్‌ఎం ఆనంద్ ఈ విచారణ చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఎంఈవోలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

పాతమల్లంపేటలో రెవెన్యూ సదస్సు



పాతమల్లంపేట సదస్సులో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

గొలుగొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతమల్లంపేట గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసరావు శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి వివిధ భూ సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, నాయకులు ఎ.అప్పలనాయుడు, ఆనంద్ పాల్గొన్నారు.

51 చౌక దుకాణాలకు 143 దరఖాస్తులు

నర్సీపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం డివిజనల్ కేంద్రంలోని 51 చౌక ధరల దుకాణాలకు 143 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో ఖాళీలు ఏర్పడ్డ 37 చౌక దుకాణాలతో పాటు సర్దుబాటులో భాగంగా కొత్తగా ఏర్పాటు చేయనున్న 14 దుకాణాలు ఉన్నాయి. వీటి కోసం ఆర్డీవో వీవీ రమణ ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. డీలర్ల పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ప్రింటౌట్ కాపీని 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. దీంతో సబ్ కలెక్టర్ కార్యాలయం దరఖాస్తుదారులతో కిటకిటలాడింది. ఈ నెల 26న రాత పరీక్ష, 27న మౌఖిక పరీక్షలు నిర్వహిస్తామని ఆర్డీవో తెలిపారు.



చౌక దుకాణాలు ఏర్పాటుకు దరఖాస్తులు అందజేస్తున్న అభ్యర్థులు

ముగిసిన జిల్లా స్థాయి విలువిద్య పోటీలు



రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పరవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి విలువిద్య పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 30 మందికిపైగా క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిలో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 23 నుంచి 25 వరకు రాజమండ్రిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక చేశామని విశాఖ జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. ఈ పోటీలకు కోచ్‌లుగా కె.గోవింద్, వి.శివకుమార్ వ్యవహరించగా, ,జిల్లా ఆర్చరీ సంఘం ఉపాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఇండియన్ రౌండ్‌కు లలితసాయి, మోహిత్‌సాయి, నాభ్య ప్రభాత్, పూర్వరాథోడ్, బి.వైష్ణవి, సాహితి, సాయిమనస్వీ, హర్షిత తదితరులు ఎంపికయ్యారు. అలాగే కాంపౌండ్ రౌండ్‌కు హర్ష, సాహిత్, వియశస్వి, వి.ఆద్య, రికర్వ్ రౌండ్‌కు సాత్విక్, అరియానా, తన్మయి ఎంపికయ్యారు. స్టాండ్ బైలుగా అశోక్, తేజేశ్వర్, ప్రణీత, కీర్తి ఎంపికయ్యారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

» ఓ వ్యక్తిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమ్మపాల గ్రామంలో శుక్రవారం ఒక వ్యక్తి నుంచి 20 మద్యం క్వార్టర్ సీసాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు. కూండ్రం గ్రామానికి చెందిన ఎం.మహాలక్ష్మినాయుడు తుమ్మపాలలో మద్యం కొనుగోలు చేసి స్వగ్రామం వెళ్తుండగా విలేజ్ విజిటింగ్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ శ్రీను, సిబ్బంది అనుమానం వచ్చి తనిఖీ చేయగా 20 మద్యం సీసాలు లభ్యమయ్యాయన్నారు. ఈ మేరకు సీసాలను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు.

విద్యలో నర్సీపట్నానికి గుర్తింపు తీసుకురండి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు



బెలూన్లు ఎగురవేసి కార్యక్రమం ప్రారంభిస్తున్న స్పీకర్

నర్సీపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నర్సీపట్నానికి విద్యలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కోరారు. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నలంద ఇంగ్లీషు మీడియం స్కూల్ వార్షిక క్రీడా వేడకను శుక్రవారం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా చేయాలన్నది తనకు 40 ఏళ్ల కల అన్నారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుతో 90 శాతం కల నెరవేరిందన్నారు. భవిష్యత్తులో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పిల్లల చదువులు పట్ల తల్లిదండ్రులు కూడా దృష్టి పెట్టాలని సూచించారు. క్రీడా దినోత్సవంలో భాగంగా ఆటల పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు పతకాలు, జ్ఞాపికలు అందజేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, కరస్పాండెంట్ నేరేళ్ల రాజేశ్, ఎంఈవో తలుపులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నిల్వల స్థాయి పరిశీలన



నీటి నిల్వల స్థాయిని పరిశీలిస్తున్న జియాలజిస్టు

మాకవరపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరకన్నపాలెం గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి నిల్వల స్థాయిని తనిఖీలు చేయిస్తున్నారు. గ్రామానికి వెళ్లే రహదారిలో శుక్రవారం జియాలజిస్టుతో నీటి పరీక్షలు చేశారు. గ్రామంలో నాలుగు చోట్ల ప్రభుత్వం బోర్లు ఏర్పాటు చేసినప్పటికీ నీటి నిల్వలు లేకపోవడంతో ప్రజలకు తాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. బోర్లు నుంచి నీరు రాకపోవడంతో నేల బావి నీటిని తాగుతున్నారు. ఈ నేపథ్యంలో నీటి నిల్వలను పరిశీలించి బోర్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు జోగిపాత్రుడు పొల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరిల్ పంపిణీ

నర్సీపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి)లో పదో తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులకు అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరిల్ పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి అల్లాడ సురేశ్ జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేవీ.రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇందన పొదుపు వారోత్సవాలు

డీఈఈ రామకృష్ణారావు



నర్సీపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇందన పొదుపుపై శనివారం నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఈపీడీసీఎల్ డీఈఈ వీడీవీ రామకృష్ణారావు తెలిపారు. మొదటి రోజు జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఇందన పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. 15న స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందన పొదుపుపై అవగాహన సదస్సు, 16న నర్సీపట్నం వేములపూడి మోడల్ స్కూల్, చోడవరం కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 17వ తేదీన కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు, 18న ముఖ్య కూడళ్లలో బ్యానర్ల ప్రదర్శన, ప్రభుత్వ కార్యాలయాల్లో కరపత్రాల పంపిణీ, 19న గ్రామాలలో కళాజాత ద్వారా ఇందన పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. 20వ తేదీన చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తామని ఆయన తెలిపారు.

సెప్టిక్ ట్యాంక్ సీజ్

నర్సీపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్ద చెరువులో మల వ్యర్థాలు ఒంపుతున్న సెప్టిక్ ట్యాంక్‌ను సీజ్ చేసినట్టు మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. ఆదివారం రాత్రి సెప్టిక్ ట్యాంక్‌తో మల వ్యర్థాలు తీసుకొచ్చి నర్సీపట్నం పెద్ద చెరువులో ఒంపుతుండగా పట్టుకున్నట్టు చెప్పారు. వాహనాన్ని సీజ్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. పెదబొడ్డేపల్లి పెద్ద చెరువులో కూడా ఇదే తరహాలో చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, అక్కడ నిఘా పెట్టి సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

గొలుగొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని 13 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు తగిన సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు చెప్పారు.

15న తాండవ నీరు నిలిపివేత



నాతవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలకు ఈ నెల 15న సాగునీరు నిలిపివేస్తున్నట్టు డీఈఈ అనురాధ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 19న తాండవ ఆయకట్టు రైతులకు కుడి, ఎడమ కాలువల ద్వారా 52 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేశామని చెప్పారు. డిసెంబరు 20వ తేదీ వరకు తాండవ నీరు ఖరీఫ్ పంటకు విడుదల చేయాల్సి ఉండగా ఆయకట్టు రైతులు ఇంకా అవసరం లేదని చెప్పడంతో ఐదు రోజులు ముందుగానే గేట్లు మూసి వేస్తున్నట్టు డీఈఈ తెలిపారు. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 369 అడుగులు ఉందన్నారు.

గోవాడ షుగర్స్ ఎండీకి సత్కారం


» మెరుగైన రికవరీ సాధనకు పురస్కారం



ఎండీ సన్యాసినాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, పీలా గోవింద్ తదితరులు

చోడవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సహకార రంగ షుగర్ ఫ్యాక్టరీల్లో మెరుగైన రికవరీ సాధనకు కృషిచేసిన గోవాడ షుగర్స్ ఎండీ వి. సన్యాసినాయుడుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పురస్కారం లభించింది. అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం నిర్వహించిన 65వ కిసాన్ మేళా సందర్భంగా మాజీమంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా ఆయనకు ప్రశంసాపత్రం అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్సటెన్సన్ శివన్నారాయణ, వివిధ కార్పొషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, పీవీజీ కుమార్, ఆర్ ఏ ఆర్ ఎస్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో సైతం రికవరీ సాధించిన ఎండీని అభినందించారు. రైతులు, కార్మికుల సహకారంతోనే ఈ అవార్డు లభించినట్టు ఎండీ సన్యాసినాయుడు ఈ సందర్భంగా తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ పర్యటన



రోలుగుంటలో పర్యటిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

రోలుగుంట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ శుక్రవారం మండలంలోని సుడిగాలి పర్యటన చేపట్టారు. రోలుగుంట, కుసర్లపూడి, కొమరవోలు, కొవ్వూరు తదితర పాఠశాలల్లో పర్యటించి ఆయా పాఠశాలల్లో నెలకున్న సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ అభ్యర్థిగా ఫ్యానల్ చేసిన రఘువర్మకు మరొక్క అవకాశం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ఏపీటీఎఫ్ అధ్యక్షులు పి.రమణ, ప్రధానకార్యదర్శి బి.రాము, ప్రధాన సలహాదారులు కె.అశోక్ సామ్రాట్, బి.రాఘవనాయుడు, ఉమామహేశ్వరరావు, జీవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమం



ఏకొత్తపల్లిలో పారిశుధ్య చేపడుతున్న దృశ్యం

దేవరాపల్లి, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఎ.కొత్తపల్లిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం శుక్రవారం సర్పంచి చింతల సత్యవెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో వీధులను శుభ్రపరచి చెత్తను తగులబెట్టారు. కార్యదర్శి విజయ్ భాస్కర్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి మధ్యలో మురుగు.. రాకపోకలకు తిప్పలు

» రావికమతంలో సబ్‌స్టేషన్ వద్ద దుస్థితి

రావికమతం, డిసెంబరు 13, (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రహదారిపై వర్షపు నీటితోపాటు డ్రైనేజీ నుంచి వచ్చే మురుగు నీరు ఏకమై నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. కింతలి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి సబ్ స్టేషన్ వరకు లోతట్టులో ఉంది. దీంతో ఇటీవల కురిసిన వర్షంనీటితో పాటు వేపాడ వీధికి చెందిన వాసుల డ్రైనేజీ నీరు తోడైంది. ఈ నీరు ఎటూ వెళ్లే మార్గం లేక నిత్యం రహదారిని ముంచెత్తుతోంది. ఫలితంగా సబ్ స్టేషన్ కార్యాలయానికి వచ్చి పోయే వారికి తీవ్ర ఇబ్బందుకు గురి చేస్తోంది. ఈ మురుగు నీరు పైకి పోయే చర్యలు చేపట్టాలని, లేకుంటే సబ్‌స్టేషన్‌లోపలికి వెళ్లే మార్గం ఎత్తుగానైనా చేసి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ నందన్‌ను సంప్రదించగా సబ్ స్టేషన్‌కు వచ్చే మార్గం లోతుగా ఉం డడంతో సమస్య నెలకొంటుందని, క్వారీ బుగ్గి, మట్టితో కప్పి రాకపోకలకు ఇబ్బంది లేకుండ చర్యలు చేపడతామన్నారు.



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిలిచిన వర్షం, మురుగు నీరు

నేడు 80 సాగునీటి సంఘాలకు ఎన్నికలు

చోడవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని 80 సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు స్థానిక జలవనరుల శాఖ డి ఇ వేణుగోపాల్ తెలిపారు. చోడవరం మండలంలో 3 మీడియం, 18 మైనర్ సంఘాలు, బుచ్చెయ్యపేటలో ఒక మీడియం 14 మైనర్ సంఘాలు, రావికమతంలో 10 మైనర్ సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. మాడుగుల నియోజకవర్గంలో మాడుగులలో 10మీడియం, 14 మైనర్ సంఘాలు, చీడికాడలో 7 మీడియం, 3 మైనర్ సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

చీడికాడ: మండలంలో తొమ్మిది సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు ని ర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి చింతల వేణు గోపాలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో మూడు మైనర్ , ఆరు మీడియం సంఘాలకు ఎన్నికలు జరుగుతా యన్నారు. వీరభద్రునిపేట రెండు, తురువోలులో రెండు, వీరపురాజుపేట, చీడికాడ, అప్పల రాజుపురం, జేబీ పురంలో ఒక్కోటి, జి.కొత్తపల్లిలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8గంటల నుంచి ఎన్నిక ప్రారంభమవుతుందని తెలిపారు. ఈఎన్నికలకు 30మంది పీవోలను, ఏపీ వోలను నియమించామన్నారు. వీరంతా సామగ్రితో ఆయా కేంద్రాలకుఎంపీడీవో కార్యాలయం నుంచి శుక్రవారం సాయంత్రం వెళ్లారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్: ఎస్ఐ



దిబ్బపాలెం కేంద్రానికి వెళుతున్న ఎన్నికల అధికారులు

సాగునీటి సంఘాలకు జరిగే ఎన్నికలకుగాను ఏర్పాటుచేసిన 11 కేంద్రాల్లో 144 సెక్షన్ విధించినట్టు స్థానిక ఎస్ఐ బి.సతీశ్ తెలిపారు. తహసీల్దార్ వైవిఎస్ ప్రసాద్ ఆదేశాలపై శనివారం ఉదయం 9 నుంచిసాయంత్రం వరకూ ఈ సెక్షన్ అమ లులో ఉంటుందన్నారు. గ్రామాల్లో ఒకేచోట ఐదు గు రికంటే ఎక్కువమంది ఉంటే చర్యలు తీ సుకుం టా మన్నారు. కేంద్రాలవద్దగట్టిపోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు.

ప్రణాళికాబద్ధంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన

» డీఎల్‌డీవో మంజుల వాణి

చోడవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే సమగ్ర ప్రణాళికలు అవసరమని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి మంజుల వాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులకు సుస్థిర లక్ష్యాలు అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రణాళికలు ఏ విధంగా రూపొందించాలి అనేది వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీవీఎస్‌జే ఆంజనేయులు, ఈవీపీఆర్‌డీ మహేశ్ పాల్గొన్నారు.

పేదరికంలేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి

చీడికాడ: పేదరికంలేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో హేమసుందరరావు కోరారు. ఎల్ఎస్‌డీజీఎస్ పై శుక్రవారం ఎంపీడీవో కార్యాల యంలో గ్రామ సచివాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు జరిగిన శిక్షణ 2వ రోజు శు క్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్ఎస్ డీజీఎస్‌పై మొత్తం 17 లక్ష్యాలు కాగా, వీటిలో తొమ్మిది లక్ష్యాలను గుర్తించామన్నారు. మెరుగైన జీవనోపాధులు ,ఆరోగ్య కరమైన పిల్లల స్నేహపూర్వక, నీటి సమృద్ధి కలిగిన , పరిశుభ్రమైన, హరిత గ్రామం, సామాజిక న్యాయం సామాజిక భ ద్రత గ్రామాలుగా తీర్చేందుకు ప్రజలను కూడా చైతన్యవంతులను చేయించాలని కోరారు. ఈ శిక్షణలో ఈవోపీఆర్‌డీ ఎం. కామేశ్వరరావు, ఏఈలు శరగడం పరదేశి నాయుడు, నమ్మివెంకటరావు, హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు, పట్నాలగోపి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీ ఎల్‌డీవో మంజుల వాణి



మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందరరావు

వీరభద్రునిపేటలో రీసర్వే నిర్వహించాలి

చీడికాడ: వీరభద్రునిపేట రెవెన్యూ భూములకు ప్రభుత్వం వెంటనే రీసర్వే చేయించాలని గ్రామానికి చెందిన కొల్లి విమలతోపాటు పలువురు మహిళ రైతులు అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుకు విచ్చేసిన డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సాయంత్రం వరకూ రైతుల నుంచి వచ్చిన వివిధ అర్జీలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంటాకు నర్సింహమూర్తి, గ్రామ పెద్దలు సబ్బవరపు నర్సింహమూర్తి, సబ్బవరపు గంగు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడి


» 600 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం



బెల్లం పులుసు ధ్వంసం చేస్తున్న పోలీసులు

కె.కోటపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి గవరపాలెం గ్రామంలో బట్టీలపై శుక్రవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడి చేసి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. ఎక్సైజ్‌శాఖ సీఐ పాపునాయుడు ఆదేశాల మేరకు చోడవరం ఎస్ఐ హనుమంతరావు, హెడ్ కానిస్టేబుల్ మర్ర అప్పారావు, ఇతర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. అలాగే, మండలంలోని ఆనందపురంలో 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతరావు విలేకరులకు తెలిపారు.

పోడు పారెస్టు భూములకు పట్టాలివ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రమిస్తున్న గిరిజన సంఘం జిల్లా నేత దొర

దేవరాపల్లి, డిసెంబరు 13 (ఆం ధ్రజ్యోతి): వాలాబు రెవెన్యూ పరిధిలో పోడు, పారెస్టు భూములకు పట్టాలు ఇవ్వాలని గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ లక్ష్మీదేవికి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.టి.దొర శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. గతంలో కొంత మందికే పట్టాలు ఇచ్చారని. మిగిలిన వారికి న్యాయం చేయాలని పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితంలేకపోయిందన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



పేదలకు దుస్తులందిస్తున్న దృశ్యం

దేవరాపల్లి, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడ సియోన్ ప్రార్థనా మందిరంలో ముందస్తు సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం జరిగాయి. మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు జాన్ విక్టర్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా పేదలకు దుస్తులను సర్పంచ్ బాబూరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ లివింగ్‌స్టన్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీ బైక్... ఈజీ రైడ్!



నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న ఆదరణ

- కొనుగోలుకు వినియోగదారుల ఆసక్తి
- నాలుగేళ్లలో 60 శాతం మేర పెరిగిన విక్రయాలు
- అందుబాటులో 20 కంపెనీల షో రూమ్‌లు, విభిన్న మోడల్స్
- ప్రతినెలా కొత్తగా రోడ్డెక్కుతున్న 500 వాహనాలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

చెవులు చిల్లులు పడే శబ్దం రాదు... పర్యావరణానికి విఘాతం కలిగించే పొగ లేదు.. పెట్రోల్ బంకుల వద్ద క్యూలోనిల్చొని ఫ్యూయల్ పోయించే పనిలేదు. కేవలం ఓ గంట చార్జింగ్ పెడితే సునాయాసంగా 80 కిలోమీటర్ల మేర సాఫీగా సాగిపోయే ఎలక్ట్రిక్ వాహనాలకు నగరంలో డిమాండ్ పెరుగుతోంది. అందుబాటులో వివిధ కంపెనీల షోరూమ్‌లు, విభిన్న మోడల్స్, ఆకట్టుకునే ఆఫర్లు, సర్వీసింగ్ సెంటర్లు ఉండడంతో పాటు ట్రాఫిక్‌లో హాయిగా సాగిపోయే వాహనం కావడంతో ఈవీల కొనుగోలుకు జనం ఆసక్తి చూపిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతోంది. నాలుగేళ్లతో పోలిస్తే ఎలక్ట్రిక్ స్కూటీలు, బైక్‌ల విక్రయాలు 60 నుంచి 70 శాతం మేర పెరిగినట్టు దుకాణాల యజమానులు చెబుతున్నారు. నాలుగేళ్ల కిందట నగర పరిధిలో నెలకు 50 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడవడం కష్టంగా ఉండేదని, ప్రస్తుతం 400 నుంచి 500 వాహనాలు రోడ్డెక్కుతున్నాయంటున్నారు. నగరంలో సుమారు 20 కంపెనీల షోరూమ్‌లు ఉండగా ప్రతి షోరూమ్‌లో 50 వరకు వాహన విక్రయాలు సాగుతున్నాయంటున్నారు. గతంతో పోలిస్తే వాహనం ధరలు తగ్గుముఖం పట్టడం, మంచి మైలేజీ, సర్వీసింగ్ సెంటర్లు అందుబాటులోకి రావడంతో కొనుగోలుదారుల సంఖ్య పెరుగుతోంది. ద్విచక్ర వాహనాల్లో దాదాపు 95 శాతం స్కూటీలే అమ్ముడవుతుండగా, రెండు, మూడు కంపెనీలు మాత్రమే ఈవీ బైకులను విక్రయిస్తున్నాయి.



అందుబాటులో సర్వీస్

గతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై మక్కువ ఉండి, కొనుగోలు చేసినా వారిని సర్వీసింగ్ సమస్య వెంటాడేది. దీంతో చాలామంది కొనుగోలుపై విముఖత వ్యక్తం చేసేవారు. కాగా ఉత్పత్తి కంపెనీలు పెరగడం, మార్కెట్‌లో పోటీ వాతావరణం నెలకొనడంతో ప్రస్తుతం ఆయా కంపెనీలన్నీ షోరూమ్‌తోపాటే సర్వీసింగ్ సెంటర్లను నెలకొల్పుతున్నాయి. అందుబాటులో మెరుగైన సేవలు లభిస్తుండడంతో కొనుగోలుదారుల సంఖ్య క్రమేణా పెరుగుతోందని ఓలా స్టోర్ మేనేజర్ మహేష్ వివరించారు.

ప్రముఖ కంపెనీల ఈవీలు

వాహన రంగంలో ఉన్న అనేకసంస్థలు వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇటీవల ఈ జాబితాలోకి ప్రముఖ కంపెనీలు చేరాయి. ప్రస్తుతం మార్కెట్‌లో బజాజ్, టీవీఎస్, ఏథర్ ఎనర్జీ, హీరో, క్వాంటమ్, యాసిర్, ఓలాతో పాటు మరో 12 కంపెనీలు ఎలక్ట్రిక్ స్కూటీలను ఉత్పత్తి చేసి, తమ షోరూమ్‌ల ద్వారా విక్రయాలు సాగిస్తున్నాయి. వివిధ వర్గాల వారు, ముఖ్యంగా యువతీ యువకుల అభిరుచులకు అనుగుణంగా స్కూటీలను డిజైన్ చేస్తుండడంతో మార్కెట్‌లో ఈవీల విక్రయాలు పెరుగుతున్నాయి.



అందుబాటులోకి ధరలు..

గతంలో ఎలక్ట్రికల్ స్కూటీల కనీస ధర రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉండేది. ప్రముఖ కంపెనీలు వాహనాల ధరను తగ్గించి విభిన్నమైన మోడల్స్‌ను అందుబాటులోకి తెస్తున్నాయి. దీంతో ఆదరణ పెరుగుతోంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ స్కూటర్లు రూ.80 వేల ప్రారంభ ధర నుంచి లభిస్తున్నాయి. గరిష్టంగా రూ.1.9 లక్షల వరకు మోడల్, ఫీచర్స్‌ను బట్టి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. స్కూటీ మోడల్, ఫీచర్లు, బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి 80 నుంచి 170 కిలోమీటర్ల మైలేజీ వచ్చే వాహనాలు నగరంలో లభిస్తున్నాయి. మహిళలు, పురుషులు తేడా లేకుండా అధికశాతం మంది స్కూటీల కొనుగోలుకే ఆసక్తిచూపిస్తున్నారు.

ఫీచర్లు ఎన్నో..

ఎలక్ట్రిక్ వాహనాల్లో ఫీచర్లు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. ఫుల్ ఎల్‌ఈడీ లైటింగ్, టచ్ స్విచ్ గేర్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ఫోన్‌కాల్, మెసేజ్ అలెర్ట్, నావిగేషన్, క్రాస్ అలెర్ట్, జియో ఫెన్సింగ్, లాస్ట్ పార్కింగ్, లౌడ్‌స్పీకర్స్ వంటి అనేక ఫీచర్లున్నాయి. వీటితోపాటు కొన్ని స్కూటీలు ఖరీదును బట్టి మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నాయి.

మూడేళ్లుగా వినియోగిస్తున్నా..



మూడేళ్ల కిందట స్కూటీ కొనుగోలు చేశాను. చాలా బాగుంది. ఇప్పటివరకు పెద్దగా సమస్యలు రాలేదు. మొదట్లో సర్వీసింగ్‌కు ఇబ్బంది ఉండేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. నగరంలో ప్రతిరోజూ ఎక్కువ దూరం తిరిగే వారికి బాగా ఉపయోగపడుతుంది. రైడ్ సాఫీగా సాగుతుంది. శబ్దం ఉండదు. ఒకసారి చార్జింగ్ చేసుకుంటే 80 కిలోమీటర్లు వరకు తిరిగే వీలు. మూడేళ్లుగా స్కూటీ రైడ్‌ను ఎంజాయ్ చేస్తున్నా.

- జె.వెంకటేశ్వర్లు, ఈవీ వినియోగదారుడు



వరుసగా పెట్ నీడ్స్ దుకాణాలు

అక్కడ దొరికేవన్నీ పెంపుడు జంతువులకే

ప్రత్యేకత సంతరించుకున్న అప్పుఘర్ రోడ్

పెట్ మాల్స్

పెట్...ఇది స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కలవారు జాతి కుక్కలను పెంచుతుండడంతో తామూ ఖరీదైన బ్రీడ్‌లను తెప్పించి మరీ పెంచుకునేందుకు అనేకమంది ఉత్సాహం చూపిస్తున్నారు. పెట్స్‌ను సాకడమంటే ఆహారం పెట్టేసి వదిలేయడం కాదు...దానికీ ఓ లెక్కుంది. ప్రత్యేకమైన ఆహారం, స్నానానికి సబ్బులు, ఇలా చాలా లిస్ట్ ఉంది. ఇందుకోసం ప్రతినెలా ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించాల్సిన పరిస్థితులున్నాయి.

- ఎం.వి.పి.కాలనీ-ఆంధ్రజ్యోతి


ఓ దుకాణంలో అమ్మకానికి పక్షులు

ఒకేచోట దుకాణాలు...

ఖర్చుకు వెనకాడకున్నా...ఇవన్నీ ఎక్కడ లభిస్తాయి...ఎన్ని దుకాణాలు తిరగాలనేది ప్రతి వారికీ సందేహమే. పెట్స్‌ను సాకేందుకు ఒకేచోట అనేక దుకాణాలుంటే...ఇలా పెంపుడు జంతువుల ప్రేమికులకు ఆనందమే. నగరంలో ఇలా పెంపుడు జంతువులకు అవసరమైనవన్నీ కొనుగోలు చేసేందుకు నగరంలో ప్రత్యేకంగా ఓ ప్రాంతం ఉంది. అక్కడ అన్నీ పెట్స్‌కు సంబంధించిన వస్తువులు అమ్మే దుకాణాలే...



ఎంవీపీ కాలనీలోని అప్పుఘర్ రోడ్డు పెంపుడు జంతువులకు పెట్టాల్సిన ఆహార పదార్థాలు, నీళ్లు పెట్టడానికి బౌల్స్ రెడీమేడ్ శాకాహారం, మాంసాహారం, నెయిల్ కట్టర్స్, వెంట్రుకలు కట్ చేయడానికి కత్తెర, ట్రిమ్మర్, టూత్ బ్రష్, టూత్ పేస్ట్, బాత్ టబ్, షాంపూ, దువ్వెన, బెల్ట్, చైన్, సబ్బులు, తువ్వాలు, మ్యాట్స్ కాలర్ ఐడీ, బొమ్మలు లాంటి వస్తువులన్నీ లభ్యమవుతాయి. కుక్కలను వేడి, చలి నుంచి కాపాడేందుకు వీలుగా వివిధ రకాల వస్త్రాలు కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

పెట్‌కు డిజైనర్ వేర్...

ఫ్యాషన్ షో కోసమో, సరదాగా తిప్పడానికి కుక్కలను బయటకు తీసుకువెళ్లే వారి సంఖ్య ఎక్కువే. ఇందుకోసం ప్రత్యేకంగా డిజైనర్ వేర్ లభిస్తున్నాయి. రూ.వంద నుంచి ప్రారంభమై రూ.వేలల్లో పలికే కుక్కల కాస్ట్యూమ్స్ ఇక్కడ దుకాణాల్లో ఉన్నాయి. వాటితో పాటు వివిధ బ్రీడ్‌ల పప్పీలు, పిల్లులు, చెవుల పిల్లులు, చేపలు, తాబేళ్లు,విదేశీ పక్షులు, వాటి కోసం పంజరాలు విక్రయానికి ఉన్నాయి.


పక్షుల కోసం పంజరాలు

'సినిమా పిచ్చోడు' చిత్ర యూనిట్ సందడి


దేవరాపల్లిలోని థియేటర్ వద్ద సందడి చేస్తున్న సినిమా యూనిట్

దేవరాపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లిలో సినిమా పిచ్చోడు చిత్ర యూనిట్ శుక్రవారం సందడి చేసింది. మండలంలోని మారేపల్లికి చెందిన కుమారస్వామి అనే యువకుడు నటుడిగా, డైరెక్టర్‌గా తీసిన ఈ సినిమాను స్థానిక మహేశ్వరి థియేటర్‌లో శుక్రవారం ప్రదర్శించారు. సినిమాను చిత్ర హీరో కుమారస్వామి, స్థానికులతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాను హెచ్ 23, జగన్నాటకం చిత్రాల తరువాత సినిమా పిచ్చోడు యన్నేటి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై తీసినట్టు చెప్పారు. ప్రేక్షకుల ఆదరాభిమానాలతో మరిన్ని సినిమాలు తీస్తానన్నారు. మరో రెండు సినిమాల్లో నటించనున్నట్టు చెప్పారు. అనంతరం అభిమానులు మధ్య కేక్‌కట్ చేశారు. యూనిట్ సభ్యులను థియేటర్ యజమాని కరుణాకరరావు, సత్తిబాబు, దేముళ్లు, గండేపల్లి శ్రీను, కిల్లి గోవింద, స్వామినాయుడు, సింహ సత్కరించారు.

26 టేకు దుంగలు స్వాధీనం


టేకు కలప స్వాధీనం చేసుకున్న నర్సీపట్నం రేంజర్ లక్ష్మీనర్సు

నర్సీపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 26 టేకు దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి మాకవరపాలెం మండలం బయ్యవరం గ్రామ శివారులోని పొలాల నుంచి టేకు కలప మినీ వ్యాన్‌లో తరలిస్తున్నారని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి స్థానిక పోలీసులకు సమాచారం అందింది. అప్రమత్తమైన పోలీసులు టేకు కలపతో ఉన్న మినీ వ్యాన్‌ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి, అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. నర్సీపట్నం రేంజ్ అధికారి లక్ష్మీనర్సు కలపతో ఉన్న వ్యాన్‌ని డిపోకి తరలించారు. సమగ్రంగా విచారించాలని ఫారెస్టు సెక్షన్ అధికారి అప్పారావు, గార్డు నూకరాజులను రేంజ్ అధికారి ఆదేశించారు. వ్యాన్‌లో 26 టేకు దుంగలకు సంబంధించి 0.7 క్యూబిక్ మీటర్లు కలప ఉన్నట్టు లెక్కలు తేల్చారు. రూ.36వేలు జరిమానా విధించినట్టు తెలిపారు. ఇదిలావుండగా టేకు చెట్లు ఎక్కడ నరికారు? ఎవరివి.. ఎక్కడకు తరలిస్తున్నారన్న సమాచారం గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

విధులకు ఉపాధ్యాయుడు గైర్హాజరు

- వెంకయ్యపాలెం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులే..
- విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కరువు
- విశాఖపట్నం నుంచి రాకపోకలు


వెంకయ్యపాలెం పాఠశాలలో ఖాళీగా ఉన్న కుర్చీ

మాకవరపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉన్నది ఇద్దరు విద్యార్థులు.. వారికి చదువు చెప్పవలసిన ఉపాధ్యాయుడు తరచూ విధులకు డుమ్మా కొడుతున్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఫోన్ రావడంతో ఉదయం 11.30 గంటల సమయంలో వెంకయ్యపాలెం ప్రాథమిక పాఠశాలకు వెళ్లగా.. అక్కడ ఉన్న ఇద్దరు విద్యార్థులు బయట ఆడుకుంటున్నారు. పాఠశాల లోపలకు వెళ్లగా విద్యార్థులు వచ్చి కూర్చొన్నారు. మాస్టారు ఇప్పుడే వచ్చి వెళ్లిపోయారని భయపడుతూ సమాధానం చెప్పారు. అయితే వాస్తవానికి ఉపాధ్యాయుడు శుక్రవారం పాఠశాలకు రాలేదు. సెలవు పెట్టలేదు.

మండలంలో వెంకయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో సంతోష్‌కుమార్ అనే ఉపాధ్యాయుడు ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో ఐదేళ్లుగా ఇద్దరు విద్యార్థులే ఉంటున్నారు. విశాఖపట్నం నుంచి కారులో నచ్చినప్పుడు రావడం, నచ్చినప్పుడు వెళ్లిపోవడం చేస్తున్నా మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఈ పాఠశాలపై అనేక ఆరోపణలు ఉన్నా ఎంఈవో-1 పట్టించుకున్న పాపాన పోలేదు. శుక్రవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఎంఈవో-1కు ఫోన్ చేయగా.. ఉపాధ్యాయుడుకే వత్తాసు పలికినట్టు మాట్లాడడం గమనార్హం. అనంతరం ఎంఈవో-2కి ఫోన్ చేయగా.. పక్క పాఠశాల నుంచి అక్కడకు మరో ఉపాధ్యాయుడుని పంపించి విధులు సాగించారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయుడు ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. దీనిపై ఎంఈవో మూర్తిని వివరణ కోరగా.. వెంకయ్యపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు శుక్రవారం సెలవు పెట్టలేదన్నారు. విషయం తెలిసిన వెంటనే పక్క పాఠశాల ఉపాధ్యాయుడుని అక్కడకు పంపించామన్నారు. విధులకు హాజరుకాని టీచర్‌పై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.

రైతులకు మద్దతుగా వైసీపీ నిరసన ర్యాలీ

- జేసీకి వినతిపత్రం అందజేసిన నాయకులు


జేసీకి వినతిపత్రం ఇస్తున్న బూడి, మాజీ ఎమ్మెల్యేలు

అనకాపల్లి టౌన్/కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలకు అండగా వైసీపీ నాయకులు పట్టణంలో శుక్రవారం నిరసన ర్యాలీ ప్రారంభించారు. రింగురోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ రింగురోడ్డు నుంచి మెయిన్‌రోడ్డు, సుంకరమెట్ట జంక్షన్, సబ్బవరం రోడ్డు మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం కలెక్టరేట్ వద్ద వైసీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ.. రైతు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ. 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తుందన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలన్నారు. గోవాడ చక్కెర కర్మాగారం రైతులకు చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. పెట్టుబడి సహాయం అందకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేశారన్నారు. అనంతరం జేసీ జాహ్నవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ బీశెట్టి సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు, కంబాల జోగులు, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బొడ్డేడ ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసనకు హాజరుకాని నేతలు

అనకాపల్లిలో వైసీపీ నిరసన ర్యాలీకి పలువురు ఆ పార్టీ నేతలు హాజరు కాలేదు. వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు కార్యక్రమానికి హాజరు కాలేదు.

పేకాట డెన్‌పై పోలీసులు దాడి

- 27 మంది అరెస్టు, రూ.1.89 లక్షల నగదు స్వాధీనం
- 18 మొబైల్ ఫోన్లు, 12 బైక్‌లు సీజ్



పోలీసులు అదుపులోకి తీసుకున్న పేకాటరాయుళ్లు (ఇన్‌సెట్‌లో) సీజ్ చేసిన నగదు,

ఎస్.రాయవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం శివారులో వున్న ఒక తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం మధ్యాహ్నం స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా కొంతమంది పేకాటరాయుళ్లు పారిపోవడానికి ప్రయత్నించగా, అప్పటికే నలువైపులా మాటు వేసిన పోలీసులు.. ఒక్కరు కూడా తప్పించుకోకుండా వెంటపడి మరీ పట్టుకున్నారు. 27 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకుని అక్కడే లెక్కించారు. మొత్తం రూ.1,89,000 నగదు, 18 మొబైల్ ఫోన్లు, 12 బైకులను సీజ్ చేశారు. పేకాట శిబిరంపై స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేసినట్టు సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ విభీషణరావు అక్కడకు చేరుకుని, నిందితులను ఆటోలపై పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పేకాట శిబిరంపై స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసూర్యారావు, ఎలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడి చేశారు.

కాగా మూడు రోజుల నుంచి ఇక్కడ పెద్దఎత్తున పేకాట ఆడుతున్నారని, ఈ విషయం స్థానిక పోలీసులకు తెలిసినప్పటికీ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక టీడీపీ సీనియర్ నేత ఒకరు ఈ పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నారని, పోలీసులు వస్తే తాను చూసుకుంటానని పేకాటరాయుళ్లకు భరోసా ఇచ్చారని చెబుతున్నారు. దీంతో కొంతమంది స్థానికులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఇక్కడి పోలీసులతో సంబంధం లేకుండా స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేశారని అంటున్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

... 5వ పేజీ తరువాయి

బైఠాయించారు. వారిరువురిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చదువు కోసం పంపిస్తే పొట్టన పెట్టుకున్నారని, ఆరోగ్యం బాలేదని చెబితే పరీక్షలు అయ్యేంత వరకూ పంపించబోమనడమేగాకుండా 'నీకు వచ్చింది జ్వరం కాదు, దెయ్యం పట్టింది' అంటూ వార్డెన్ కొట్టారని బాలిక తల్లిదండ్రులు ఆరోపించారు. గతంలో ఈ ఆశ్రమ పాఠశాలలో ఓ గిరిజన విద్యార్థిని మృతిచెందగా అధికారులు, నాయకులు ఆ విషయాన్ని కప్పిపుచ్చారని, ఇప్పుడు హెచ్‌ఎం, వార్డెన్‌ల నిర్లక్ష్యంగా వ్యవహరించి మరో విద్యార్థి చనిపోయిందని మృతురాలి గ్రామానికి చెందిన సర్పంచ్ జీరుగుబోయిన ఈశ్వరావు ఆవేదన వ్యక్తంచేశారు. హాస్టళ్లలో వర్కర్లు ఉండగా విద్యార్థులతోనే పనిచేయిస్తున్నారని ఆరోపించారు. అనకాపల్లి డీఎస్పీ శ్రావణి సంఘటనా స్థలానికి చేరుకుని బాలిక తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి వి.నాగశిరీష ప్రకటించారు. పాడేరు ఐటీడీఏ డీడీ రజని, అరకులోయ మాజీ ఎంపీ మాధవి, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అక్కడకు చేరుకుని జరిగిన ఘటనపై ఆరా తీశారు.

విధులకు హెచ్‌ఎం డుమ్మాపై విచారణ

... 5వ పేజీ తరువాయి

ఎంఈఓ-2 జగ్గారావులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రోలుగుంట మండలం బుచ్చెంపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు.నాగభూషణం ఆరు నెలల నుంచి పిల్లలకు పాఠాలు చెప్పడంలేదు. ఉదయం పాఠశాలకు రావడం, బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసి వెళ్లిపోవడం. మళ్లీ సాయంత్రం నాలుగు గంటలకు స్కూల్‌కి వచ్చి బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసి వెళ్లిపోవడం చేస్తున్నారు. దీనిపై 'విధులకు హెచ్‌ఎం డుమ్మా' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జిల్లా విద్యా శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం ఉదయం డీఈఓ జి.అప్పారావు నాయుడు, డిప్యూటీ డీఈఓ అప్పారావు బుచ్చెంపేట గ్రామానికి వచ్చి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పని చేస్తున్న ఇతర ఉపాధ్యాయులు కృష్ణారావు, డీవీ సత్యనారాయణ, ఆయా నాగలక్ష్మిలను విడివిడిగా విచారించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో మాట్లాడి పలు వివరాలు అడిగారు. ప్రధానోపాధ్యాయుడు ఆరు నెలల నుంచి రోజూ ఉదయం 9 గంటలకు పాఠశాలకు వచ్చి బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసి వెళ్లిపోయి, మరలా సాయంత్రం నాలుగు గంటలకు వచ్చి బయోమెట్రిక్ వేసి ఇంటికి వెళ్లిపోతున్నట్టు విచారణలో నిర్ధారణ అయ్యింది. దీంతో ఎంఈఓ-1 జాన్‌ప్రసాద్, ఎంఈఓ-2 జగ్గారావు, హెచ్‌ఎం నాగభూషణంలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని డీఈఓ తెలిపారు.

గేదె పొడవడంతో వార్డు మెంబర్ మృతి

... 5వ పేజీ తరువాయి

ఒక ఉదుటన ముందుకు పడిపోయింది. ఎంతకూ లేవకపోవడంతో అక్కడే ఉన్న మణికంఠ స్థానికుల సాయంతో ఆటోలో ఎక్కించి నక్కపల్లి ఆస్పత్రికి బయలుదేరారు. కానీ దారిలోనే ఆమె మృతిచెందింది. మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

16 నుంచి అప్పన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు

సింహాచలం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఈనెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నామని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. 16న ఉదయం 6.35 గంటలకు ఆలయ రాజగోపురంలో నెల గంట పెట్టడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. కాగా ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 31 నుంచి జనవరి 17 వరకు పగల్‌పత్ ఉత్సవాలు, అంతర్భాగంగా ముక్కోటి ఏకాదశి, ధారోత్సవాలు, కనుమ పండుగ నాడు మకరవేట నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు స్వామివారి తిరువీధి ఉత్సవాలు జరగాల్సి ఉన్నందున ఆయా తేదీల్లో ఆర్జిత సేవలను రద్దుచేస్తున్నట్టు ఈఓ ప్రకటించారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి నుంచి పదిరోజుల పాటు రాపత్ ఉత్సవాలు జరుగుతాయని, ప్రతిరోజు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పలు అవతారాల్లో అలంకరించి తిరువీధి నిర్వహిస్తామన్నారు. ఆయా తేదీల్లో రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామి దర్శనాలు లభిస్తాయని, రాత్రి ఆరాధన టికెట్లు, ధనుర్మాసాన్ని పురస్కరించుని ఈనెల 16 నుంచి జనవరి 17 వరకు సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధన టికెట్లను రద్దుచేస్తున్నామన్నారు. జనవరి 13న భోగి రోజున సాయంత్రం 5 గంటల నుంచి గోదా రంగనాథుల కల్యాణం జరగాల్సి ఉన్నందున ఆరోజు ఉదయం 9.30 గంటలకు జరిగే నిత్యకల్యాణాన్ని రద్దుచేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619